ప్రపత్తి


# శ్రీసన్నిధానం

## ఆధ్యాత్మిక మాస పత్రిక

కరీంనగర్ సంపుటి: 01 సంచిక: 07 సెప్టెంబర్ 2024 పేజీలు:36 వెల:30



అత్యధిక పాఠక ఆదరణ పొందుతున్న ఆధ్యాత్మిక మాస పత్రిక



# ముఖచిత్రపరిచయం

సంకల్ప బలంతో ప్రార్థిస్తే భగవంతుడు సైతం కరుణించే అవకాశం ఉంది. అందుకే వివిధ దేవతామూర్తులను పూజిస్తాం. విఘ్ననివారకుడిగా, వామనుడిగా, అనంత పద్మనాభుడిగా మనను కరుణించే విధంగా జయంతి ఉత్సవాలు జరుపుకునే మాసం భాద్రపద మాసం. విఘ్ననివారణ చతుర్థి నాడు విష్వక్సేనుని ఆరాధించడం అనాదిగా వస్తున్న ఆచారం. శ్రీమహావిష్ణువుకు సర్వసైన్యాధ్యక్షుడు విష్వక్సేనుడు. శివ గణాలకు అధిపతి విఘ్నేశ్వరుడు. భాద్రపద మాసంలో శుక్ల పక్షం చతుర్థి నాడు వినాయక చవితి నిర్వహించి దేశవ్యాప్తంగా ఆయాప్రాంత ఆచారాల ప్రకారం నియమిత రోజులు ఉత్సవాలు వైభవంగా నిర్వహించి వినాయక నిమజ్జనం వేడుకగా జరుపుకుంటారు. భాద్రపద మాసం శుక్ల పక్ష ద్వాదశి తిథి నాడు వామన జయంతి. వామన జయంతికికూడా బలిచక్రవర్తి కథనం మననం చేసుకుంటాం. ఈ సందర్భంగా ఓనం ఉత్సవాలు నిర్వహిస్తారు కూడా. భాద్రపద శుక్ల చతుర్థినాడు అనంత పద్మనాభస్వామి వ్రతం జరుపుకుంటాం. ఈ వ్రతాన్ని నిర్వహించిన వారికి కష్టాలనుంచి గట్టెక్కించే మార్గం భగవంతుడు అనుగ్రహిస్తాడని భక్తుల ప్రగాఢ నమ్మకం. పండుగల సమాహార చిత్రంగా పత్రిక ముఖచిత్రం అందంగా దర్శనం ఇస్తుంది.

# గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రికకు సలహాలు, సూచనలు, చందాదారుల చిరునామా మార్పులు, నూతన చందాదారులు కావడానికి ఇ-మెయిల్ ద్వారా తెలియజేయవచ్చును.

help desk:

prapatti.srisannidhanam9@gmail.com

మాస పత్రిక చందా వివరముల గురించి సంప్రదించవలసిన హెల్ప్ డెస్క్ నెంబర్: 9502583323

(ఉదయం 9 గం. నుండి రాత్రి 9 గం. వరకు)

yono SBI | SBI Payments

MERCHANT NAME: SRI SANNIDHANAM CHARITABLE TR

UPI ID: 9502583323@SBI

SCAN & PAY

BHIM SBI Pay BHIM UPI

**సంప్రదించండి**

**మా ఈ చిరు ప్రయత్నాన్ని స్వాగతించండి!!**

**-మేనేజింగ్ ఎడిటర్**

## ముఖ్య గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక ఈ సంచికలో ప్రచురించిన రచనలలోని భావాలు ఆయా రచయితలవే, రచన సారాంశము రచయిత అభిప్రాయముగా భావించవలెను. ఈ రచనల భావంతో సంపాదకునికి, ట్రస్ట్‌నకు ఎటువంటి బాధ్యత లేదని పాఠకులు గమనించవలసినదిగా మనవి.

**- ఎడిటర్**

ప్రపత్తి శ్రీసన్నిధానం

https://srisannidhanam.org

prapatti.srisannidhanam9@gmail.com

సంపుటి: 1 - సంచిక: 7 ఎడిటర్ : డింగిరి శ్రీనివాసమూర్తి సెప్టెంబర్ 2024 వెల : 30

## ఇందులో

4. సంపాదకీయం
శ్రీమాన్ శ్రీ వొద్దిపర్తి రామచంద్రమూర్తి

6. శ్రీరామానుజ సుధామాధురి శ్రీమతి సముద్రాల శారద

8. శ్రీపతిస్తుతి
శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనర్సింహాచార్యులు

9. శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య, సిద్ధాంతి

10. దాశరథి శతకము
శ్రీమాన్ శ్రీ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు

12. భాగవతంలో భగవంతుని కథలు
శ్రీమతి తిరుమల నీరజ

13. విష్వక్సేనం తమాశ్రయే
శ్రీమాన్ శ్రీ చిలకమట్టి కృష్ణమాచార్యులు

14. తెలుసుకోవలసినవి మూడే
శ్రీమాన్ శ్రీ వంగల వెంకటాచార్యులు

16. గీతామృతం
శ్రీమాన్ ఆచి వేంకట పాండురంగాచార్య

18. విఘ్న నివారణ చతుర్థి (ప్రత్యేకం)
శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి

20. జ్యోతిర్విజ్ఞానమ్
శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

20. సతీ అనసూయాదేవి
శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు

22. వరాహావతార ప్రయోజనం
శ్రీమాన్ శ్రీ కలకుంట్ల వరప్రసాదాచార్యులు

24. అష్టలక్ష్మీ వైభవం
శ్రీమతి వంగల రాధిక

25. శ్రీరామాయణంలో ఉపకథలు
శ్రీమతి చక్రవర్తుల చూడామణి

29. ఋషి వాక్య ప్రబోధాలు
శ్రీమాన్ శ్రీ డా.యం.టి.ఆళ్వార్ స్వామి

30. మంత్రానికి చింతకాయలు రాలుతాయ?
శ్రీమాన్ శ్రీ కవి కృష్ణమాచార్యులు

31. విశిష్టాద్వైత సిద్ధాంతము
శ్రీమాన్ శ్రీ ఏ.కే.శ్రీనివాసాచార్యులు

నెలవారిపంచాంగం, మనదేవాలయాలు, పుస్తక పరిచయం, బాలవిజ్ఞానం, శ్రీసన్నిధిపదకేళి

**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్

డింగిరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య

శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు

నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

## సంపాదకీయం

# సనాతన విజ్ఞాన సంపదకై అన్వేషణ



**వి**జ్ఞాన అన్వేషణలో ఎన్నో అమూల్య ఘట్టాలు. అద్భుతాలు ఆవిష్కారం అయ్యాయి. అసలు ప్రాచీన తాళపత్ర గ్రంథాలు ఏమైపోయాయి. ఒక్క క్షణం ఆలోచించారా? ఇందుకోసం ఏంచేయాలి? చేజారిపోయిన జ్ఞాన సంపదను తిరిగి ఎలా పొందాలి. ప్రాచీన కాలంలో విజ్ఞాన సముపార్జన కోసం భారత దేశానికి ఎందరో విదేశీయులు వచ్చారు. మన దేశంలో 2వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు వెలుగొందిన విశ్వవిద్యాలయాలలో అధ్యయనం కోసం వచ్చేవారు. అలా వచ్చిన వారు తాము అధ్యయనం చేసిన విషయాలను తమ ప్రాంతంలో ప్రాచుర్యం ఉన్న భాషలో అనువాదం చేసుకుని వెళ్ళేవారు. అలా సంస్కృత భాషనుంచి అనువాదం చేసుకున్న వారిలో బౌద్ధులు, జైనులు, చైనీయులు, జపనీయులు, పర్షియన్లు, అరబ్బులు, తురుష్కులు, ఆంగ్లేయులు యూరోపియన్లు, రష్యన్లు ఉన్నారు. ఎందుకంటే సమస్త భారతావనిలో ప్రాచీన సంప్రదాయం నెలకొని ఉన్నదని, అందులో ఉన్న విజ్ఞాన విషయాలు మానవాళి ప్రయోజనానికి ఎంతోమేలు చేస్తాయని విశ్వసించారు. దేవ భాషలో ఉన్న ఉపనిషత్తుల సారాన్ని వెలికి తీసే ప్రయత్నాన్ని నాడే చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. ఈ సంపదను కొల్లగొట్టి సొంతం చేసుకోవాలని కొందరు, తాము నేర్చుకున్నది చాలు భవిష్యత్తులో మరెవ్వరూ తమను మించిపోవద్దని ధ్వంసం చేసేవారు మరి కొందరు ప్రత్యక్షంగా పరోక్షంగా దాడులు చేశారు. చేతికి అందినది అందినట్లు తమ తమ దేశాలకు తరలించారు. ఎంత అనర్థం జరగాలో నాడే జరిగింది. కానీ సంస్కృత భాషలో ఏదైనా చెప్పాలంటే అది శ్లోకరూపంగా ఉండేది. అది మౌఖికంగా గురువుచెప్పితే విని వల్లెవేసి నేర్చుకునేదే కానీ ముద్రణ ప్రతి లభించేది కాదు. చేతిరాతతో కానీ తాళపత్ర గ్రంథాలలో రాసుకునేవారు. అలా కొందరి వద్ద విజ్ఞానం భద్ర పరుచబడింది. కానీ అది వెలుగుకు నోచుకోలేదు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి భారతీయులపై రుద్దబడిన మెకాలే విద్యావిధానం పుణ్యమా అని విదేశీ చదువులపై మోజుపెరిగింది. సంస్కృతం భాష అడుగంటి పోయింది. నేర్చుకునే వారు తక్కువైపోయారు. తాళపత్ర గ్రంథాలు అనుకోకుండా ఎవరి ఇంట భద్రపరచబడినా వాటి విలువ తెలువకుండాపోయింది. ఇలా కొన్ని కుటుంబాల వారు తమ ఆస్తిపంపకాలలో సంస్కృత భాషలో ఉన్న పుస్తకాలు, ఇతర భాషలలోకి అనువదించిన పుస్తకాలు ఆస్తి పంపకాల ద్వారా పిత్రార్జితాన్ని పంచుకుంటూ పోయారు. ఇవీ విలువైనవే సుమా అనుకున్నవారు తమకు అందుబాటులో ఉన్న లైబ్రరీలకు దానంచేశారు. ఇలా క్రమంగా దేశ విజ్ఞాన సంపద ఎల్లలు దాటిపోయింది. ఈ వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు. ఖగోళ రహస్యాలను ఆవిష్కరించే సూర్యసిద్ధాంతం గురించి ఇటీవల జరిగిన విద్వత్సమ్మేళన సభలో శ్రీమాన్ సంపత్ కుమార కృష్ణమాచార్య (జనగామ సిద్ధాంతి) గారు పలు విషయాలను ప్రస్తావిస్తూ సూర్యసిద్ధాంత గ్రంథం ఒకటి జర్మనీదేశంలోని లైబ్రరీలో ఉందని వెల్లడించారు. అది మణిప్రవాళ భాషలో ఉందని వెల్లండించారు. జైనులు, వైష్ణవులు తమ విజ్ఞాన రచనలను సంస్కృతంనుండే కాక తమిళ, మలయాళ, సంస్కృత భాషలలోని అంశాలను చేర్చి రచించే వారని తెలిసింది. 3వ శతాబ్దం నుంచి 10వ శతాబ్దంవరకు మణిప్రవాళ భాషలో గ్రంథస్థం చేసేవారని ఆధారాలు ఉన్నాయి. ఎందుకంటే సూర్యుడు, నక్షత్రాలు, గ్రహాలు వాటి గమనాల గురించి మణిప్రవాళ భాషలో రచనలు చేశారు. ఈ భాష అక్షరాలు మలయాళ, తమిళ 'స్క్రిప్ట్'ను పోలి చిత్రరూపంగా ఉంటాయి. ఇప్పటి పంచాంగాలలో కొన్ని గుర్తులను మణిప్రవాళ భాషలో ఉపయోగించిన వాటి మాదిరిగానే ఉపయోగిస్తున్నారన్న వాదన లేకపోలేదు. మణిప్రవాళం మలయాళం, సంస్కృతం కలయికతో కూడిన కళాత్మక శైలి. మణిప్రవాళం అనే పదం విలువైన రాళ్లను, పగడాలను సూచిస్తుంది. అందుకే దేశం ఉత్తరం నుండి కేరళకు వలసవచ్చిన నంబూద్రి బ్రాహ్మణులు సంస్కృతము మాట్లాడినా గ్రంథ రచనకు మణిప్రవాళ భాషను ఎంచుకునే వారు. భారత న్యూటన్‌గా చెప్పుకునే బ్రహ్మగుప్తుని కాలంలో మణిప్రవాళం, అరబ్బు భాషలో అనువాదానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఇలా విదేశాలలో ఉన్న గ్రంథాలను, లేదా డిజిటల్ ప్రతులను తెప్పించేందుకు పాలకులు కదలాలి. ప్రాచీన విజ్ఞాన సంపదను పరిరక్షించాలి, పునరుద్ధరించాలి ముందు తరాలకు అందించాలి.

–వొద్దిపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

**భాద్రపదమాసం 03-09-24 శుక్లపక్షంతో ప్రారంభమై 02-09-24 వరకు, 03-09-24 నుండి ఆశ్వయుజమాసం**

13-09-24 వరకు పుబ్బ కార్తి, 13-09-2024 నుండి ఉత్తర కార్తి, 27-09-24 నుండి హస్త కార్తి,

**పండుగలు** :02-09-24 పొలాల అమావాస్య, 07-09-24 విఘ్న నివారణ చతుర్థి, శ్రీవినాయకచవితి. 08-09-24 ఋషి పంచమి, 11-09-2024 దుర్గాష్టమి 14-09-24 ఏకాదశి, 15-09-24 వామన జయంతి, 17-09-24 వినాయక నిమజ్జనం, అనంతపద్మనాభవ్రతం, 19-09-2024 మహాలయ పక్షారంభం, 21-09-24 సంకష్టహరచతుర్థి, 28-09-24 సర్వేషాం ఏకాదశి, 02-09-24 బతుకమ్మ సంబరాలు

## మాస ఫలాలు



**మేషం:** ఈ నెల వృత్తి వ్యాపారాలు అనుకూలించును. వ్యవహార జయము. ఆదాయం వృద్ధి, ఇతరుల విషయంలో జోక్యం చేసుకొని మాటలు పడతారు. దైవ సంబంధ కార్యాలందు పాల్గొంటారు.



**వృషభం:** ఈనెల అన్నిరంగాలవారికి యోగమే. నూతన వస్తు, వస్త్రప్రాప్తి, విలువైన వస్తువులను కొంటారు. సుఖమైన జీవితం లభించును.



**మిథునం:** ఈ నెల ఆనందంగా జీవనం గడుచును. ప్రశాంత వాతావరణం ఉంటుంది. దైవదర్శనములు, ఆధ్యాత్మిక విషయాలలో పాల్గొంటారు.



**కర్కాటకం:** ఈ నెల అనుకూలం, దూర ప్రయాణాలు, పుణ్యనదీ స్నానములు, దైవ దర్శనములు, రావలసిన బాకీలు వసూలగుట, వృత్తి వ్యాపారము లందు అనుకూలత, కుటుంబంలో మీ మాటపైచేయి,



**సింహం:** ఈ నెల అనుకూలంగా ఉండదు. పనులందు ఆటంకాలు, మనస్సు ప్రశాంతంగా ఉండదు. ఏదో ఒక సమస్యతో బాధపడుదురు. ప్రతి విషయంలోనూ జాగ్రత్త అవసరం.




**కన్య:** ఈ నెలలో అంతగా అనుకూలంగా ఉండదు. వ్యాపారములందు స్వల్పంగానష్టాలు, పనులందు ఆటంకాలు, ఆరోగ్యభంగాలు, ఊహించని ఖర్చులు, సమస్యల వల్ల బాధలు,



**తుల:** ఈ నెలలో అనుకూలంగా ఉండదు. పనులందుఆటంకాలు, ఆరోగ్యభంగాలు, ఊహించని ఖర్చులు, ఆరోగ్యం కూడా బాగుండదు.



**వృశ్చికం:** ఈనెలలో అన్నింటా మీదే పైచేయి. అన్నిరంగాల వారికి అభివృద్ధి కన్పించును. కుటుంబ సఖ్యత పుణ్యనదీ స్నానఫలం. గృహజీవితానందం. దూరప్రయాణాలు చేయుట, ధనలాభం,



**ధనుస్సు:** ఈనెలలో అన్నిరంగాల వారికి వృత్తి వ్యాపారాలందు రాణింపు ఉంటుంది. హుషారుగా, స్వల్పకోపంతో ఉంటారు. ప్రతీ చిన్న విషయానికి ఉద్రేకపడుట వలన అనవసర గొడవలు సంభవించును.



**మకరం:** ఈ నెల మిశ్రమ ఫలితాలు. సమస్యలున్నా ధైర్యంగా ముందుకు పోగలరు. ఆదాయం బాగుంటుంది. ఆరోగ్యం కుదుటపడును.



**కుంభం:** ఈనెల ఆరోగ్యభంగాలు, పనులందు ఆటంకాలు, వృత్తి, వ్యాపార,వ్యవహారనష్టాలు గృహంలోవిరోధాలు, ప్రతిచిన్నవిషయానికి భయపడుట, శారీరక శ్రమ, అలసట, అకాలభోజనాలు,



**మీనం:** ఈ నెలలోకూడా మిశ్రమ ఫలితాలే. ఆరోగ్యం బాగుండును. ఆదాయంనకు లోటుండదు. పనులు చివరి నిముషంలో సాధిస్తారు. ఒక్కోసారి శారీరకబాధలుతప్పవు.

**అనంత పద్మనాభ వ్రతాన్ని భాద్రపద శుద్ధ చతుర్దశినాడు జరుపుకోవాలి. కామ్య సిద్ధి కోసం చేసే వ్రతాలలో కెల్లా అనంత పద్మనాభ స్వామి వ్రతం ప్రధానమైనది. ఈ వ్రతాన్ని ఆచరించడంవల్ల సకల సంపదలు చేకూరడంతో పాటుగా కష్టాలలో ఉన్నవారు కూడా బయటపడటానికి తరుణోపాయంగా ఉపయోగపడును.**

## మంచి రోజులివిగో...

**ఈనెల వివాహ, గృహారంభ, గృహప్రవేశ శుభ ముహూర్తములు లేవు**

**15,19,29 బోరింగు ముహూర్తములు కలవు.**

# శ్రీరామానుజ సుధామాధురి

## అనంత కీర్తి – సుగంధ మూర్తి



**– శ్రీమతి సముద్రాల శారద**

భౌతిక శరీరానికి జన్మనిచ్చిన తల్లిదండ్రుల కంటే జ్ఞాన జన్మనిచ్చిన గురువు యొక్క సంస్కార ప్రభావం ప్రతి ఒక్కరిలో ఎక్కువగా ఉంటుంది. గురువు ప్రబోధించే ఉపదేశాలతో పాటు తద్భావజాలం మరియు విద్యా విషయాలు, వ్యక్తి యొక్క మూర్తిమత్వ స్ఫూర్తిలో అత్యంత ప్రభావం చూపిస్తాయి. అందుకే పెద్దలు మేధావులు సంస్కారవంతమైన విలువలు కలిగిన సమాజ సృష్టి కావాలంటే విద్యా విధానం మంచిదై ఉండి బోధన వ్యవస్థ సజావుగా సాగాలని ఆకాంక్షిస్తుంటారు.

మన దేశంలో వైదిక ధర్మంలో గురు శిష్య సంబంధము అనేది విశ్వసనీయంగా పరంపరాగత ఆచార, జ్ఞాన ధారను సంపన్నవంతం చేసేదై ఉంటుంది. జ్ఞానవంతుడైన ఆచార్యుని యొక్క ఆజ్ఞలు, అనురక్తులు ఛాత్రుల అనుసరణలలో హృదయాలలో శిలాశాసనాలై నిలిచి ఉంటాయి.

ఇక దైవాంశ సంభూతులైన ఆచార్యుల, శిష్యుల గురించి చెప్పనవసరము లేదు.

ఉగ్గు తినే శిశువులు తల్లి చేతి అమృత ఆహారాన్ని ఆస్వాదిస్తారే కానీ స్వయంగా ఆ పదార్థ పరిశీలనకు ప్రయత్నించరు. అసలా పరిజ్ఞానమే వారికి ఉండదు. మాతృ రక్షణలో గల శిశువుకు మరే అవసరము రానట్టు ఆచార్యుల వాక్కులను శృతి శిరోసారంగా ఎంతటి జ్ఞాన వంతులైన శిష్యులయినా దానిని నిర్ద్వంద్వంగా అనుసరించారు.

'ఆచార్యాత్ ఏవ విదితా విద్యా సాధిష్ఠం ప్రాపత్' అని ఆచార్యుల వద్ద నేర్చిన విద్యయే పరిపూర్ణమైనదని కూడా పెద్దల వాక్కు. అలాగే ఆచార్యుల యందు భక్తి కలిగి ఉంటేనే ఆ విద్య ఫలిస్తుంది అని కూడా పెద్దల మాట. ఇందులో మరొక అలౌకిక రహస్యం కూడా ఉంది. గురువుపై భక్తి గలిగి విద్యనేర్చిన "ఏకలవ్య చరిత్ర" తెలిసినదే! గురువు యందు గల అపారమైన భక్తి చేత నేర్చుకున్న విషయార్థాలే కాక నేర్పని విశేషార్థాలు కూడా స్ఫురిస్తాయి "తస్యైతే అకథితాఃహ్యర్థాః" అని ఆచార్యుని సన్నిధిలో చెప్పనివి కూడా తెలుస్తాయి అని పెద్దలు చెప్తారు.

అది భగవద్రామానుజాచార్యుల చరిత్రలో చూడవచ్చు. యామునాచార్యుల ఉపదేశములను ప్రత్యక్షంగా వినకపోయినను వారు ఏర్పాటు చేసిన పంచాచార్యుల వద్ద సంప్రదాయ గ్రంథార్థాలను సేవించారు. వారు తెలపని, యామునుల హృదయ గతమైన విశేష అర్థాలను భగవద్రామానుజులు ఎంతో స్పష్టంగా వివరించేవారట!. అవి విని వారు యామునులయందు భగవద్రామానుజులకు గల భక్తికి అనుగ్రహానికి ఆశ్చర్యపోయేవారట!

ఈ విధంగా సహస్ర ఫణిభూషితులై ఆదిశేషాంశతో అవతరించిన భగవద్రామానుజులు సహస్ర కిరణాల వంటి శిష్యాగ్రేసరుల ద్వారా సిద్ధాంతాన్ని సంప్రదాయాన్ని ప్రకాశింప చేసి దేశమంతా ప్రసరింప చేశారు. ఎందరో శిష్యులు తమ ఆచార్యులైన జగదాచార్యుల చరిత్ర కీర్తిని వారి గ్రంథాల్లో కూడా ఉపక్షిప్తం చేశారు. అంతేకాదు ఆచార్యుల ఆజ్ఞను శిరసావహించి అదే జీవన మార్గంగా ఎంచుకొని అదే మోక్షదాయకమని భావించిన శిష్య శ్రేష్ఠులూ ఉన్నారు. వారే అనంతాళ్వాన్లు. వారి చరిత్ర పరమపావనం. పుణ్యదాయకం కూడా ఎందుకంటే జగదాచార్యులయందు వారికుండే పరిపూర్ణ ఆచార్య నిష్ఠ ఒకటయితే, కలియుగ ప్రత్యక్ష దైవమయిన శ్రీనివాస పెరుమాళ్ళకు మిక్కిలి ప్రీతిపాత్రుడు. అనంతుని అవతార స్వరూపమై భగవద్రామానుజాచార్యుల ఆజ్ఞా, సంకల్పములతో అనంతార్యులు పుష్ప కైంకర్యం చేశారు. తిరుమల కొండపైన పూచిన పువ్వులన్ని తిరుమలేశునికే అని స్వామిని సుందర సుగంధ మూర్తిగా భక్తులకు దర్శింప చేశారు. తిరుమలను పుష్పమంటపంగా సార్థకం చేశారు.

# శ్రీరామానుజ సుధామాధురి



అనంతాళ్వాన్ దివ్య చరితం అంటే తిరుమల శ్రీవెంకట ముడయాన్ దివ్య వైభవము అని చెప్పవచ్చు. నేటికీ వారు పుష్ప కైంకర్యం చేసిన తోట, వారి పవిత్ర బృందావనం, ఆ స్థానంలో భగవద్ ఆజ్ఞచే నాటబడిన పొగడ వృక్షం, జగదాచార్యుల పేరుపైన ఏర్పరచిన పుష్కరణి, వంశపారంపర్యంగా శ్రీనివాసుని సేవించే వారి (23వ) వంశస్థుల నివాసము ఇవన్నీ నాటి భక్తి కైంకర్యాలకు గుర్తుగా నేటికీ మనం దర్శించవచ్చు.

"ప్రథమం గురుకార్యంచ దేవకార్యం ద్వితీయకం" అని ఆచార్య ఆజ్ఞగా పుష్పమంటపంగా ప్రసిద్ధమైన తిరుమలలో స్వయంగా నేలను చదును చేసి మొక్కలు నాటి పువ్వులు పూయించి మాలలు కట్టి శ్రీవేంకటేశ్వర స్వామికి నిత్యం అర్పించాడు. అలా తరించిన అనంతాళ్వాన్ స్వామితో ప్రత్యక్షంగా సంభాషించినట్లు కూడా తిరుమల చరిత్ర వైభవం తెలియజేస్తున్నది.

విజయనామ సంవత్సరమున (1053) మైసూర్ సమీపానగల శ్రీరంగ పట్టణమునకు మూడు కిలోమీటర్ల దూరంలో తిరంగనూరు అనే గ్రామంలో వీరు కూడా ఆదిశేషాంశతోనే అవతరించారట! భగవత్ రామానుజుల వైభవాన్ని తెలుసుకొని సంప్రదాయ అనురక్తులై వారిని ఆశ్రయించదలచి శ్రీరంగానికి వచ్చారు. జ్ఞాన సంపన్నులైన యజ్ఞమూర్తులు జగదాచార్యులకు శిష్యులై అరుళాల పెరుమాళ్ ఎంబిరుమానార్ అను పేరును పొందారు. వారి వద్దకు అనంతార్యులను శిష్యులుగా జగదాచార్యులు పంపించారు. తాను అనంతార్యులకు ఉపదేశం ఇచ్చినప్పటికీ అందరికీ భగవద్రామానుజులే ఆచార్యులని "జానీధ్వం లక్ష్మణార్యస్య పాదమేవహి రక్షకం" అని వారి పాదాలే అందరికీ రక్షకం అనేది తెలుసుకోండి అని బోధించారు. ఆ విధంగా అనంతార్యులు భగవద్ రామానుజులపై ఆచార్య నిష్ఠతో వారి సన్నిధిలో ఒకరోజు సహస్ర గీతికి వ్యాఖ్యానమును (భగవద్విషయమును) వింటున్నారు. ఆ సందర్భంలో ప్రస్తుతించిన నమ్మాళ్వార్ల పాశురం "ఒయివిల్ కాలమెల్లాం! ఉడనాయ్ మన్ని!" అనే దానికి అర్థాన్ని తెలుపుతూ సుందరమైన వెంకటాద్రి యందు తేజోమయుడైన శ్రీనివాసునికి ఎడతెగని కైంకర్యము చేయాలని నమ్మాళ్వార్ల సంకల్పాన్ని వివరిస్తున్నారు.

"నిత్యం శ్రీ వేంకటేశాయ నిత్యశ్రీవత్సధారిణే
ప్రదాతా తులసీదామ్నామ్ యోవా కోవాస్తి కిం మహాన్"

అని తిరుమలలో పుష్పవనాన్ని నిర్మించి ఎవరైనా శ్రీవత్స ధారి అయిన శ్రీ వేంకటేశ్వరునికి "మాలా కైంకర్యం" చేసేవారు ఉన్నారా అని ప్రశ్నించారట! వెంటనే అనంతార్యులు గురువాజ్ఞతో సంసిద్ధులై గర్భిణి అయిన భార్యతో కూడి తిరుమలకు చేరి అక్కడ తోటను నిర్మించి పుష్పకైకర్యం చేయనారంభించాడు. అందుకు వారు తన భార్యతో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. జంతువులు, క్రిమి కీటకాలు, అనేక అడ్డంకులు కలిగినా ఎదుర్కొని చివరికి శ్రీనివాసుడు పెట్టిన పరీక్షకు తట్టుకొని నిలిచాడు. భగవంతుడు వారి కథను చరితార్థం చేయదలచి అనేక లీలలు ప్రదర్శించాడు అని తిరుమల చరిత్ర వైభవం ద్వారా తెలుసుకోవచ్చు. తిరుమల శ్రీనివాసుని పుష్ప కైంకర్యము కొరకు తోటను నిర్మించడానికి నేలను చదును చేస్తూ పాదులు బావి తవ్వుతూ మట్టి ఎత్తిపోస్తూ ఎంతో కష్టపడ్డారు అనంతార్యులు. వారి పవిత్ర చరిత్రను తెలుసుకొందాము. (సశేషం)

# శ్రీపతి స్తుతి - సుభాషితం


మంచి మాట

## గజేంద్ర మోక్ష విషయమైన శ్లోకద్వయము

శ్లో॥ నక్రాక్రాంతే కరీంద్రే ముకుళిత నయనే మూల
మూలేతి ఖిన్నే।
నాహం నాహం నచాహం నచ భవతిపునః తాదృశో
మాదృశేషు।
ఇత్యేవం త్యక్త హస్తే సపది సురగణే భావశూన్యే సమస్తే।
మూలం యత్ ప్రాదురాసీత్ సదిశతు భగవాన్ మంగళం
సంతతం నః॥

ప్రతిపదార్థం: కరీంద్రే = గజేంద్రుడు, నక్రాక్రాంతే = మొసలి చేత ఆక్రమింపబడిన వాడై, ముకుళిత నయనే = దుఃఖాధిక్యము చేత కనులు మూసుకున్నవాడై, మూల మూల ఇతి = సకల జగత్తునకు మూల కారణమైన వాడా అని, ఖిన్నే = ఖిన్నుడై బిగ్గరగా ఏడ్చుచున్నవాడగుచుండగా, ('సతి' = అని తెచ్చుకోవాలి. దీనిని వ్యాకరణ పరిభాషలో 'సతి సప్తమి' అంటారు. అంటే ఏమిటి? గజేంద్రునికి సంబంధించిన విశేషణములు, గజేంద్ర పదము సప్తమి విభక్తిలో ఉన్నది. తెలుగులో 'అందున' అంటారు. ఇప్పుడిక్కడ ప్రథమ విభక్తిలో 'గజేంద్రుడు' అని చెప్పుకున్నాం అర్థం. అదెట్ల అనగా 'సతి' అనే పదము చేర్చడం వలన గజేంద్రుడు ఖిన్నుడగుచుండగా అనే భావం వస్తది. మొదటి శ్లోకంలో గూడా అట్లే 'సతి సప్తమి' వుంది. అందుకే మొఱపెట్టుకొను చుండగా అని చెప్పుకున్నాము.

అహం = నేను, న = కాదు, అహం = నేను, న = కాదు, అహంచ = నేను నూ, న= కాదు, తాదృశః = అటువంటి (సృష్టికి మూల) కారణత్వము, మాదృశేషు = మా వంటి వారలందు, న చ భవతి పునః = లేనే లేదు, ఇతి = అని, ఏవం=ఇట్లు, సపది = వెంటనే (ఒక్క సారిగా) సమస్తే = సమస్తమైన, సురగణే = బ్రహ్మ,రుద్ర, ఇంద్రాది సమూహము. త్యక్త హస్తే = చేయి విడిచి ఊరకుండగా, భావశూన్యే = సమస్త బ్రహ్మాండములును, భావశూన్యే = (సతి) = వ్యాపార శూన్యమైయుండగా, యత్ = ఏ, మూలం = ఆదికారణము (యధార్థ మూలకారణమైన విష్ణువు) ప్రాదురాసీత్= ప్రత్యక్షమయ్యెనో, సః భగవాన్ =జ్ఞాన, శక్తి, బలైశ్వర్య వీర్య తేజములుగల శ్రీమన్నారాయణుడు, సః = మనకు, సంతతం = ఎల్లప్పుడు, మంగళం = శుభమును, దిశతు = ప్రసాదించు గాక అని ప్రార్థన.



**శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనరసింహాచార్యులు**

తాత్పర్యము: మకరి గజేంద్రుని గట్టిగా పట్టుకొని పీడింప జొచ్చినది. ఒక వేయి సంవత్సర ములు అంటే దివ్య వత్సరములు పోరాటం జరిగింది. ఐతే క్రమంగా ఏనుగు శక్తి సన్న గిల్లింది. అదే సమయంలో మొసలి శక్తి విజృంభించు చున్నది. ఇక గజము బాధ భరించలేక దుఃఖంతో కనులు మూసుకొని జగత్తునకు మూల కారణమైనవాడా! జగత్తు నంతటిని శాసించువాడా! ఆది మూలమా! నన్ను ఈ మొసలి బారినుండి రక్షించుము అని ప్రార్థించినాడు. అప్పుడు సృష్టికి మూలకారణము నేను కాదు నేను కాను నేను అంతకంటే కాదు అంటూ బ్రహ్మ, రుద్ర, ఇంద్రాదులు అందరు ఒక్క సారిగా విడిచి ఊరకున్నారు. ఆ సమయంలో సమస్త బ్రహ్మాండములు వ్యాపార శూన్యమైనవి. అప్పుడు యథార్థ మూలమైన శ్రీమన్నారాయణుడు గజేంద్రునకు ప్రత్యక్షమై రక్షించెను. అట్టి జ్ఞాన శక్త్యాది సకలగుణాఢ్యుడైన శ్రీమన్నారాయణుడు మన కెల్లప్పుడును శు భములనే ఇచ్చుగాక అని ప్రార్థన.

ఇక ఈ గజేంద్ర మోక్ష సందర్భమునసే మరో 3 శ్లోకములు 'శ్లోకత్రయం' అని ప్రసిద్ధినొందినవి. అవి మనకు ఎంతో ఉపయోగం గలవి. వాటిని గూడా అర్థ, తాత్పర్యములలో అనుభవించుదాము.

1. శ్లో॥ ప్రాతస్స్మరామి భవ భీతి మహార్తి శాంత్యై
నారాయణం గరుడవాహన మంజనాభం।
గ్రాహాభి భూత మద వారణ ముక్తి హేతుం
చక్రాయుధం తరుణ వారిజ పత్ర నేత్రమ్॥

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

(క్రిందటి సంచిక తరువాయి)

శల్యదోష స్థాన పరిమాణము :

శ్లో॥ పురుషాధః స్థితం శల్యం నగృహే దోషదం భవేత్‌।

భూగర్భములో పురుష ప్రమాణములోతు లోపల శల్యము లున్నచో అవి గృహమునకు దోషమును కలుగచేయును. పురుషప్రమాణమునకు మించిన లోతులో శల్యములున్నచో అవి గృహమునకు దోషమును కలుగ చేయవు.

పురుష ప్రమాణమనగా ఏమి ?

శ్లో॥ పంచారత్నిర్ధన వితస్తి ర్వింశతి కరాంగుళః పురుషః।

నూట యిరువది అంగుళముల ప్రమాణమని శాస్త్రం తెలియజేసినది.

శ్లో॥ కవర్గో చ్చారితే ప్రశ్నే ఆగ్నేయాం దిశిచాదిశేత్‌।
మార్జాలాస్థ్యజ శల్యం స్యాత్‌ హస్త మాత్ర ప్రమాణతః॥

కవర్గాక్షరములందు ప్రశ్న అక్షరమున్న ఆగ్నేయపు దిక్కున ఒక హస్తము లోతులో పిల్లి ఎముకలు లేదా మేక ఎముకలు వుండును.

శ్లో॥ చవర్గో చ్చారితే ప్రశ్నే యామ్యాం దిశిసమాదిశేత్‌।
హరేర్లులాయ శల్యం స్యాత్‌ హస్త మాత్ర ప్రమాణతః॥

ప్రశ్న అక్షరము చవర్గాక్షరములలో వున్న దక్షిణ దిశ యందు హస్త ప్రమాణము లోతులో గుఱ్ఱము ఎముకలు లేదా దున్నపోతు ఎముక లుండును.

శ్లో, టవర్గో చ్చారితే ప్రశ్నే నైఋత్యాం చ సమాదిశేత్‌।
శునశ్శల్యం నృశల్యం వాసార్థ హస్త ప్రమాణాతః॥

ప్రశ్న అక్షరము టవర్గాక్షరములో వున్న నైఋతి దిశ యందు ఒకటిన్నర హస్తము లోతులో కుక్క ఎముకలు లేదా మనిషి ఎముక లుండును.

శ్లో॥ తవర్గో చ్చారితే ప్రశ్నే ప్రతీచ్యాంతు సమాదిశేత్‌।
సర్పాస్థ్యండజ శ్మల్యంవా హస్త ద్వయ మితేక్షితౌ॥

ప్రశ్న అక్షరము తవర్గాక్షరములో యున్న పశ్చిమ దిక్కున రెండు హస్తముల ప్రమాణము లోతులో సర్ప శల్యములు లేదా పక్షి శల్యము లుండును.

శ్లో, పవర్గో చ్చారితే ప్రశ్నే వాయవ్యం చ సమాదిశేత్‌।
ఆఖోర్గా కస్య శల్యం వా హస్త మాత్ర ప్రమాణతః॥

ప్రశ్న అక్షరము పవర్గాక్షరము లో వున్న వాయవ్య దిక్కు హస్త ప్రమాణము లోతులో పంది కొక్కు ఎముకలు లేదా గుడ్లగూబ ఎముకలు వుండును.



శ్లో॥ యవర్గో చ్చారితే ప్రశ్నే
పృదీచ్యా మాదిశేత్తదా।
గజాశ్వాధ్యస్థి శల్యం వా
పురుష మాత్ర ప్రమాణతః॥

ప్రశ్న అక్షరము యవర్గాక్షరములో వున్న ఉత్తర దిశలో ఒక మనిషి నిడివి లోతులో యెనుగు ఎముకలు లేదా గుఱ్ఱము ఎముకలు వుండును.

శ్లో॥ శవర్గో చ్చారితే ప్రశ్నే
ఈశాన్యాం చ సమాదిశేత్‌।
శశకాదృక్ష శల్యం వా
హస్త ద్వయ మితేక్షితౌ॥

ప్రశ్న అక్షరము శవర్గాక్షరములో వున్న రెండు హస్తముల లోతులో చెవులపిల్లి యేములు లేదా ఎలుగు బంటి ఎముక లుండును.

శ్లో॥ ప్రశ్నే పృచ్చారితే దేవే
బ్రహ్మాస్థానే సమాదిశేయ్‌।
నృశల్యం ఖగశల్యం వా
పురుషస్య ప్రమాణతః॥

ప్రశ్నలో దేవుని పేరు చెప్పిన బ్రహ్మాస్థానము నందు మనుష్య ప్రమాణము లోతులో మనిషి ఎముకలు లేదా పక్షి ఎముకలుండును.

శ్లో॥ ప్రశ్నే పృచ్చారితే యత్ర న్యానవర్గస్య పంచమే।
నవిద్యతే తత్ర శల్యం బ్రహ్మోక్త త్వాన్న సంశయః॥


ప్రశ్న అక్షరములలో ఙ,ఞ,ణ,న,మ.య అను అక్షరములలో ఒక అక్షరము ఉచ్చరించిన ఆ స్థలమున శల్యములుండవు. (జ్యోతిస్సంహిత) (మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

**శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి**



# దాశరథి శతకము

## ('భద్రవేది' వ్యాఖ్యానసమ్మతి)



**శ్రీమాన్ శ్రీ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు**

భక్తి సాహిత్యంలో శతక రచనకు ఒక విశిష్ట స్థానమున్నది. 'శతేన శతకమ్ ప్రోక్తమ్' అని సాహిత్య లక్షణకారులు చెప్పినట్లు నూరు పద్యములు లేక నూరు శ్లోకములు కలిగిన రచనకు శతకం అనిపేరు. పేరుకు శతకమే అయినా ఒకటి రెండు పద్యములు తక్కువయినా అది శతకమే. ఐదో పదో పద్యములు ఎక్కువయినా అది శతకమే.

శతకమనేది అష్టోత్తర శతపద్య ప్రసూనాలతో సాహితీ పూజగానే మొదలయినా క్రమ క్రమంగా ఇది వివిధ ముఖాలుగా విలసిల్లుతోంది.

భగవత్పూజాపరంగానే శ్రీకారం చుట్టుకున్న ఈ శతకం నీతి ఉపదేశ కారకంగా సమాజ సంస్కరణా బోధకంగా సకలవిధ భావప్రచార సాధకంగా వివిధ స్వరూపరూపాలను సంతరించుకుంటున్నది.



సంస్కృత సారస్వతంలో ఇలా లెక్కలేనన్ని శతకాలు ఆవిర్భవించాయి. తెలుగు సాహిత్యంలోనూ చిత్ర విచిత్రములైన కథా వస్తువులతో పుంఖాను పుంఖలుగా ఎన్నో శతకాలు వెలువడినాయి వెలువడుతున్నాయి వెలువడతాయి. శతకమంటే తెలుగువారికి ఎనలేని మక్కువ. ఇది తెలుగువారి ఎడదలోనికి ఎక్కువగా జొచ్చుకుని పోయిన మనసైన సాహితీ ప్రక్రియ. మనదైన సర్వజనప్రియ ఈ శతక రచన.

వీటిలో విశిష్టములుగా, నివారిత నిఖిలారిష్టములుగా విశిష్టజన మనోభీష్టములైన భక్తిశతకములు ఉత్తమశ్రేణికి చెందినవి. వాటిలో దాశరథి శతకానిది అనన్యసామాన్యమైన స్థానం. ఆర్ద్రభక్తికి ఆస్థానం. సాంప్రదాయికములైన భక్తి ప్రపత్తుల సంస్థానం. ఈ శతక కర్త ఆర్త ప్రపన్నుడైన రామదాసుగారు. శ్రీవైష్ణవ సంప్రదాయ పరినిష్ఠితుడైన భక్తరామదాసుగారు, శ్రీభద్రాచల దివ్యక్షేత్ర విరాజ మానుడగు వైకుంఠరాముని అనన్య భక్తితో, ప్రపత్తితో సేవించి తరించిన భద్రాచల భక్త రామదాసుగారు. ఆ భక్తరామదాసు గారి భవ్యభావార్ద్ర భరితం, భక్తి రసామృతశతకం ఈ దాశరథి శతకం.

దాశరథీ! కరుణాపయోనిధీ!! అనే మకుటంతో కీర్తించ బడినది కాబట్టి ఈ శతకానికి దాశరథి శతకము అనిపేరు. శ్రీరామునికి మిక్కిలి అభీష్టమైనది. "దశరథస్య అపత్యం పుమాన్ దాశరథిః" అని నామ వివరణాత్మకమైన విగ్రహవాక్యము. దశరథుని కుమారుడు కావున దాశరథి అని తదర్థము.

రావణ వధానంతరం బ్రహ్మ రుద్ర మహేంద్రాది దేవతలంతా 'భవాన్ నారాయణో దేవః' ఇత్యాదిగా స్తోత్రం చేసే సందర్భంలో కూడా 'ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్' అని తనను తాను దశరథుని పుత్రుడైన మనుష్యునిగానే పరిచయం చేసుకున్నాడు. ఇది మాయా మానుషావతారలీల.

శ్రీరామునికి తండ్రి గారంటే వల్లమాలిన ప్రేమ, గౌరవం. 'పితుర్వచననిర్దేశాత్ పితుర్వచనగౌరవాత్' అని నాన్న గారు చెప్పారు కాబట్టి నాన్నగారి మాటపై గౌరవం కాబట్టి అది ఏకార్యమైనా తాను సిద్ధంగా ఉంటాడు. ఆ కార్యనిర్వహణలో లక్ష్యసాధనలో అదే గౌరవంతో, అంతే ప్రేమతో ⇨

ఉంటాడు. 'దారాః పితృ కృతా ఇతి' అని చెప్పినట్లు 'నాన్న గారు కలిపిన బంధం కాబట్టే సీతమ్మను అంతగా ప్రేమించాడూ అంటే తండ్రిగారంటే ఎంత గౌరవమో తెలుస్తుంది. అందువల్లనే తండ్రిగారి సంబంధం కలిగిన పేరంటే శ్రీరామునికి చాలా ఇష్టమట. అలా దాశరథీ అని పిలిస్తే మహదానందాన్ని పొందుతాడట!

శ్రీరామోపాసనాపరములైన కొన్ని ఆగమ సంహితలు శ్రీరామగాయత్రిని ప్రస్తావిస్తూ 'దాశరథాయ విద్మహే' అంటూ ముందుగా దాశరథ(థి) నామాన్నే కీర్తించాయి. ఈ రహస్యం తెలిసిన మన రామదాసుగారు ఆ నామాన్నే మకుటమణిలా ప్రయోగించారు.

అంతే కాక శ్రీభద్రాచలదివ్య క్షేత్రాన్ని సువ్యవస్థీకరించిన శ్రీరామదాసుగారే ఒక సమాచారాన్ని కూడా ప్రవేశ పెట్టారు. ప్రతి తిరువీధి సేవ (వాహన సేవ) లోనూ ఉత్సవమూర్తుల వాహనాన్ని లేపేటప్పుడైనా, ఆపేటప్పుడైనా, దింపేటప్పుడైనా 'దాశరథే' అని బిగ్గరగా సంకేతనాదం చేయాలి. నేటికీ ఆ కట్టుబాటు పాటించబడుతోంది.

అలా మకుటంలో దాశరథి అనే నామ సంబోధన తరువాత మరో సంబోధన 'కరుణా పయోనిధీ' అని. పయోనిధీ అంటే సముద్రమని అర్థం. కరుణాసముద్రుడా అని సమగ్రార్థం.

ఇతరులకు కలిగిన దుఃఖాన్ని చూచి తానూ దుఃఖించుట. వారికి ఆదుఃఖమును తొలగించుటకు యత్నించుట. ఇవి కరుణ అనే గొప్పగుణమునకు కల లక్షణములు. 'బహవో నృప! కళ్యాణగుణాః పుత్రస్య సన్తి తే' అని, అయోధ్యా ప్రజల మాటగా వాల్మీకి చెప్పినట్లు శ్రీరామునిలోని అసంఖ్యేయ కళ్యాణ గుణములన్నింటిలో ప్రాధాన్యాన్ని, ప్రాథమ్యాన్ని పొందిన గుణం కరుణ. దయ అనేది కరుణకు పర్యాయ పదము.

యత్నాదపి పర క్లేశం హర్తుం యా హృదిజాయతే।
ఇచ్ఛా కరుణ పర్యాయా సా దయా పరికీర్తితా॥

అని పాద్మంలోని 'క్రియాయోగసారమనే' గ్రంథము పరక్లేశ నివర్తకత్వాన్ని కరుణగా దయగా పేర్కొన్నది. 'పరదుఃఖదుఃఖిత్వం తన్నివర్తకత్వం' దయా (కరుణ) గుణ లక్షణములుగా పూర్వాచార్యులు వివరించారు. పరదుఃఖా సహిష్ణుత్వమ్ ఇతరుల దుఃఖాన్ని చూచి సహించలేకపోవడం కరుణా గుణమునకు కల గొప్పలక్షణము. అలాంటి కరుణా గుణముతో నిండిన పయోనిధి (సముద్రము) వంటివాడు శ్రీరాముడు.

అర్థాత్ అపార కరుణ కలిగినవాడని భావము. ఈ మకుటంలోని దాశరథీ! అనే పిలుపు (సంబోధనము) శ్రీరామునికి ఆనందాన్ని కలిగించేది కాగా, కరుణాపయోనిధీ అనే పిలుపు, తన (రామదాసుగారి) యొక్క దుఃఖమును తొలగించమని చేసే వేడుకోలు. ఆర్త ప్రపన్నుడైన ఆ మహనీయుడు భావించే దుఃఖము భవబంధమే కదా!

ఆ బంధమునకు పుణ్యపాపములే కదా కారణం! పుణ్యమూ బంధమే. పాపమూ బంధమే. బంగారు సంకెళ్ళలో బంధనమైతే అది పుణ్యం. ఇనుప సంకెళ్ళలో అయితే అది పాపం. కట్టిపడేసేటప్పుడు కాంచనమైతే నేమి? కాలాయస్సు అయితే నేమి? బంధనము తప్పదు.

అందుకే రామదాసుగారు శతకారంభ పద్యాలలో భవబంధవిమోచన సూత్ర! అని కీర్తించి చివరి పద్యాలలో "కిల్బిషవ్రజనిపాటనమందగ చేసి సత్కళాదాయి ఫలంబు నాకీయవే దాశరథీ కరుణాపయోనిధీ" అంటూ వేడుకుంటారు.

భక్త రామదాసుగారి ప్రతిపద్యమూ హృద్యమే! ఆత్మసంవేద్యమే! భద్రాద్రి రామునికి భక్తి నైవేద్యమే! ఉపక్రమం నుండి ఉపసంహారం దాకా తిరువారాధనలా సాగుతుంది శతకం. ఆత్మిక విషయాలు, పారమాత్మిక విశేషాలు, ఆత్మనివేదన సందర్భాలలో ఆళ్వారుల దివ్య ప్రబంధ ప్రభావాలు గల అద్భుతమైన శతకమిది. అర్థ పంచక జ్ఞానాల సన్నిధి. ఆస్వాదించే ప్రయత్నమే ఈ భద్రవేది. భద్రాద్రి రామునికి నైవేద్యమైన ఈ పద్య ప్రసాదాన్ని పదిమందికి పంచడమే పరమావధిగా ఈ వ్యాఖ్యాన సన్నుతి ప్రారంభమైంది. ఈ దాశరథీ శతకానికి గతంలో మహనీయులెందరో వ్యాఖ్యానాలను వెలయించారు, విశేషాలను వివరించారు.

అయినా! ఆ శతకంలో తెలియదగినవి ఎన్నో ఉన్నాయి.. సాధ్యమైనంతలో స్వాద్యములు స్వాపదేశములూ అయిన విశేషార్థములను యథామతిగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాము. నెలనెలా శ్రీరామచంద్రుని కనికరాల వెన్నెలలా భద్రగిరి దాశరథి శతకాన్ని భక్తి ప్రపత్తులతో ఆస్వాదిద్దాం!!

**"జుట్టెద నీ కథామృతము**
**జుట్టెద నీ పదకంజ తోయమున్"** ★

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

(క్రిందటి సంచిక తరువాయి)

## సనకసనందనాదుల అవతారాలు

సనకాదులు తనతో అన్న సృష్టికార్యానికి ప్రతికూలమైన మాటలు విన్న విరించికి, వారు తనను తిరస్కరించి నందుకు ఆగ్రహం కలిగింది. దానిని ఎంతో ప్రయత్నం మీద అణచుకొన్నాడు కానీ, ఆ క్రోధం వలన ఆయన భ్రూమధ్యం నుండి ఒక నీలలోహితుడు, సురలందరికీ అగ్రజుడుగా పుట్టి, అతిఘోరంగా రోదించాడు. ఆతడే రుద్రుడయ్యాడు. తండ్రి ఆనతిపై ఆతడు చేసిన సృష్టి అంతా రుద్రగణం ఐంది.

ఇక సనకాదులు అన్ని విద్యలనూ ఆపోశన పట్టినవార్రై, నిర్మలజ్ఞానసంపన్నులై, పద్నాలుగు భువనాల లోనూ స్వేచ్ఛగా సంచరించటం ప్రారంభించారు. ఒకనాడు విష్ణుసేవ చేయాలనుకొని, వైకుంఠానికి వెళ్లారు. ఆ వైకుంఠం ఒక మనోహరమైన మహాపద్మనిలయం. దివ్యంగా బంగారు శాల వలె ఉంటుంది. గోపురాలు, హర్మ్యాలతో నిండిన మహాభవనం ఒక మహాపద్మం. ఆ మందిరం మధ్యలో విరాజిల్లే శేషశయ్య ఒక కర్ణిక వలె ఉన్నది. దాని మీద భోగపర్యంకం మంచంపైన పద్మశ్రీమధ్య ఉండే భృంగం వలె మాధవుడు శయనిస్తాడు.

పరమయోగులు, బ్రహ్మానంద పరిపూర్ణులూ ఐన సనకాదులు,ఆ భవనం దగ్గరికి వెళ్లారు. ఒకొక్క కక్ష్యనే దాటుకొంటూ, చిట్టచివరి కక్ష్య వద్దకు వెళ్లారు. అక్కడ ఇద్దరు ద్వారపాలకులు, జయుడు, విజయుడు అనేవారు ఉన్నారు. వారు బంగారు, నవరత్నాల హారాలు, కేయూరాలు బాహుపురులు, దండకడియాలు ధరించారు. హస్తాలలో గదలు పట్టుకొని ఉన్నారు. నాలుగు భుజాలతో, ఉత్సాహంతో, రోషం చేత ఎర్రబడిన నేత్రాలతో, వేత్రహస్తులుగా ఉన్నారు. సనకాదులు లోపలికి వెళ్లబోగా, ఆ జయవిజయులు వారికి తమ దండాలను అడ్డంగా పెట్టి వెనుకకు నెట్టేశారు.

ప్రశాంతచిత్తులైన సనకాదులు, "ఓ ద్వారపాలకులారా! మీరు మమ్మల్ని అడ్డగించటం చిత్రంగా ఉంది! స్వామి హితం కోరి, ద్వారపాలకులు కనుక అడ్డగించారా? మమ్మల్ని లోపలికి పంపితే భగవంతుడు మిమ్మల్ని దండిస్తాడని భయపడి ఆపారా? భూసురుల మైన మాకూ, వైకుంఠనాయకుడైన సర్వేశ్వరునికీ భేదం లేదు. మమ్మల్ని అనుమానించకండి. మంద బుద్ధులై మమ్మల్ని ఆపి తప్పు చేశారు. మీరు మా శాపంతో కామక్రోధలోభాది శత్రువులు బాధించగా, భూలోకంలో పుట్టండి!" అని శపించారు.

అప్పుడు వారు గడగడ



**శ్రీమతి తిరుమల నీరజ**

లాడిపోయి, సనకాదుల పాదాలపై పడ్డారు. చేతులను నుదుట జోడించి, "మహాయోగులారా! మా విధిని మేము చేశాము. మీరేమో మమ్మల్ని శపించారు. ఏ కారణంతో నైతే నేమి, సత్పురుషులైన మిమ్మల్ని మేము పరాభవించాము, ఆ దురితమే చెడ్డ పని, దుష్కార్యం మాకు ఈ దశను కలిగించింది. మేము ఆ విధంగా అరిషడ్వర్గాలతో పుట్టినా, విష్ణునామాన్ని మాత్రం మరువకుండా ఉండాలి, దానివల్లనే మాకు శుభం కలగాలి. దీనిని అనుగ్రహించండి!" అని ప్రార్థించారు.

ఇంతలో ఈ కలకలమంతా ఆలకించిన పరమాత్మ, లక్ష్మీదేవితో సహా అక్కడికి విచ్చేశాడు. వారిద్దరి ముఖారవిందాలను దర్శించిన సనకాదులు, ఆనంద సముద్రంలో ఓల లాడారు. హరిపాదపద్మాల పైనే తమ చూపులను నిలిపి, ఆయనను స్తుతించారు.

అప్పుడు గోవిందుడు, "ఋషీశ్వరులారా! ఈ జయవిజయులు, నా ద్వారపాలకులు. వారు చేసిన అపరాధానికి తగిన శిక్షనే మీరు విధించారు. అది నాకూ సంతోషం కలిగించింది. సేవకులు చేసే అపరాధం వారి యజమానిదే. కనుక మీరు కరుణాంతరంగులై నన్ను మన్నించండి! వీరిద్దరూ భూమి మీద పుట్టి తక్కువ కాలం లోనే నా వద్దకు వచ్చే విధంగా అనుగ్రహించండి!" అన్నాడు.

అప్పుడు సనకాదులు, "దేవాదిదేవా! మేము అలిగి, వారిని శపించాము. నీవు వారిని (మిగతా 28వ పేజీలో)

# విష్వక్సేనం తమాశ్రయే



**శ్రీమాన్ శ్రీ చిలకమఱ్ఱి కృష్ణమాచార్యులు,**

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్!
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే!!

శ్రీమన్నారాయణుడు ఈ సకల చరాచర సృష్టి, స్థితి, లయకారకుడై ఆయా దైవస్వరూపములలో మనలను అనుగ్రహిస్తూ ఉన్నాడనేది వేదప్రోక్తమైన సత్యం. ఈ సృష్టి పరివారానికంతటికీ స్వామి అయిన శ్రీమన్నారాయణుడు తన సమస్త పరివారానికి సైన్యమునకు అధ్యక్షునిగా తన అంశయే ఐన విష్వక్సేనుని నియమించారని అంతే కాక ఈ విష్వక్సేనుని ఆజ్ఞ, రూపకల్పనతోనే శ్రీస్వామి తన కార్యములను పూర్తి చేస్తారని ఆచార్యోక్తి. వైఖానస సిద్ధాంతము అనుసరించేవారు విష్వక్సేనులు ఎలా అవతరించారు అనడానికి ఒక కథనం చెప్పడం మనం తెలుసుకోవాలి.



విష్వక్సేనుల వృత్తాంతం భృగుమహర్షి తాను అందించిన వాసాధికారము అనే గ్రంథములోని 23 వ అధ్యాయంలో 120 శ్లోకములలో ఆవైభవాన్ని అందించారు. ఈ విశాల భూమండలంలో పుండరీకమనే నగరాన్ని పాలిస్తున్న సుదీష్ముడు అనే రాజునకు సూర్యవంశ సంజాతురాలైన పూయసయ అనే కన్యను ఇచ్చి వివాహం చేశారు. ఈ దంపతులకు అన్ని భోగభాగ్యములు ఉన్నప్పటికీ తీరని ఒక కోరిక బాధిస్తూ ఉండేది. మహిమాన్వితుడు, భగవత్ జ్ఞానసంపన్నుడు, నిరంతర నారాయణ సేవా తత్పరుడు, ఉత్తమ భక్తుడైన కుమారుడు కావాలని ఉండేది. ఈ కాంక్షతో భగవంతుడైన శ్రీమన్నారాయణుని ధ్యానం చేస్తూ ఉండేవారు. ఎలాగైతే ప్రహ్లాదుని వలన రాక్షస వంశము భాగవతవంశంగా మారిందో తమ వంశం కూడా తమకు కలుగబోయే సంతానం ద్వారా అలా ఉన్నత భాగవత వంశంగా వెలుగొందాలని సుదీష్మ రాజదంపతులు నిత్యం శ్రీమన్నారాయణుని ధ్యానిస్తూ వేడుకొనేవారు. సమస్త జగదధ్యక్షుడైన శ్రియఃపతిని ప్రార్థిస్తూ, గృహస్థాశ్రమ ధర్మాలను పాటిస్తూ సత్కుమారుని పొందాలని ఆ రాజదంపతులు ఎదురుచూస్తున్నారు. భక్తి ప్రపత్తులకు మెచ్చి వారికి సర్వాభీష్టదాయకమైన అష్టాక్షరీ మంత్రాన్ని స్వయంగా శ్రీమన్నారాయణుడే తానే ఉపదేశంగా అనుగ్రహించారు.

అలా అష్టాక్షరీ మంత్రాన్ని జపిస్తూ స్వామి సేవ చేస్తూ కాలం గడుపసాగారు. కొంతకాలానికి ఆ సుదేష్మ రాజదంపతులకు శ్రీమన్నారాయణ సంకల్ప జనిత మానసపుత్రునిగా అష్టవర్ష ప్రాయంతో, అద్భుత మైన జ్ఞాన తేజస్సుతో ఉన్న బాలకుని కుమారునిగా అనుగ్రహించారు. ఆ బాలునికి శాంతుడు, హరుడు, విష్వక్సేనుడు, అమితుడు, నిత్యానపాయనుడు అని ఐదు నామధేయములను ఏర్పరిచారు. కొంతకాలము పెంచుకొని ఆ కుమారుడు శ్రీమన్నారాయణుని అనుగ్రహఫలమే కనుక శ్రీస్వామివారికే అర్పించాలనే కాంక్షతో త్రికరణశుద్ధిగా సుదేష్మరాజ దంపతులు ఆ కుమారుని శ్రీస్వామివారికే సమర్పించారు. ఆ బాలుడు స్వామితో సాలోక్యం పొందినాడు. అప్పుడు శ్రీహరి శాంతునితో స్వర్గలోకంలో ఉన్న సూత్రవతీ, చయ్య అనే ఒకే తల్లి కుమార్తెలు అయిన కన్యలతో వివాహం జరిపించాడు. శ్రీరమానాథుడే స్వయంగా మంత్రిగా ఎర్పరచి శ్రీవత్సము, బ్రహ్మ సూత్రము తక్క మిగతా స్వరూపాన్ని ఆ విష్వక్సేనునికి అనుగ్రహించాడు. అప్పటినుండి విష్వక్సేనుడు చతుర్భుజుడై శంఖచక్రధరుడై సర్వసృష్టి సేనాధ్యక్షుడై శ్రీహరిని కూడా నియమించే అధికారిగా వెలుగొందుతున్నాడు. నిర్మాల్యమును స్వీకరించే అర్హతను పొందినాడు, అంతేకాక శ్రీస్వామికి నివేదనచేసిన ప్రసాదంలో కొంత విష్వక్సేనులవారికి నివేదించి ఆ ప్రసాదమును భాగవతులకు నివేదించడం నేటికి విష్ణ్వాలయములలో మనం చూడవచ్చు. ఈ విధంగా వైఖానస పరంపరలోనివారు విష్వక్సేన (మిగతా 15వ పేజీలో)

# తెలుసు కోవలసినవి మూడే!



**శ్రీమాన్ శ్రీ వంగల వెంకటాచార్యులు**

మనమందరము సంసారి చేతనులమే. చేతనుడు అనగా చైతన్యంకల వాడు. అతనే జీవుడు. జీవుడే ఆత్మ. కనుక జీవుని జీవాత్మ అని అంటారు. మనందరము సంసారములో ఉండుటచేత ప్రకృతి సంబంధమైన అజ్ఞానమనే చీకటిలో మ్రగ్గుతున్నాము. దానివలన మనం ఆత్మయొక్క అసలు రూపాన్ని తెలుసుకోలేకపోతున్నాము. ఆత్మ అసలు స్వరూపం ఏమిటి? అంటే ఆత్మస్వరూపం 1.ప్రకృతికంటే వేరైనది, 2.జ్ఞానమయము, 3.ఆనందమయము, 4.భగవంతునికి మాత్రమే శేషభూతమైనది (అనగా భగవంతుని సేవకే ఉపయోగపడు వారము). కానీ మనము ఈ ఆత్మ స్వరూపమును తెలుసుకోలేక ఈ ఆత్మ ధరించిన శరీరాన్నిబట్టి ఈ ఆత్మ దేవతా శరీరములోనున్నచో 'నేను దేవుడను', మానవ శరీరములోనున్నచో 'నేను మానవుడను' అనుకొనుచు చైతన్యము లేని పంచభూతాత్మకమైన శరీరము నందు నేను అను భావన పొందుచున్నాడు.

నిజానికి శరీరము లోపల జీవుడు లేకపోతే కదలదు కదా! కానీ ఈ చిన్న విషయంకూడా మనం అజ్ఞానమువల్ల తెలుసుకోలేక పోతున్నాము. ఒకవేళ దేహము కంటే ఆత్మ వేరని తెలుసుకున్నప్పటికీ 'నేను స్వతంత్రుణ్ణి' అని అనుకుని భగవంతునికి మనం పరతంత్రులము (ఆయన కొరకే ఉండుట) అని తెలుసుకోలేక పోతున్నాము. ఒకవేళ మనకు శేషత్వజ్ఞానం (భగవంతునికి దాసుణ్ణి అనే జ్ఞానం) కలిగినా దానిని వాడవలసిన చోట వాడకుండా వాడకూడని చోట వాడుతూ సకల పాపములకు మూలమైన ఆత్మాపహార దోషమును చేయుచున్నాము. సంసార భోగములకు పరవశు లమై తనను సేవించుటకొరకై పరమాత్మ ఇచ్చిన శరీరమును ఆయనసేవకు ఉపయోగించక సేవింపకూడని వారిని సేవించుచు దుర్వినియోగము చేయుచున్నాము. ఇట్లు జ్ఞాన శూన్యముగా మార్చి అనేక జన్మలనెత్తుచు పుట్టుచు చచ్చుచు అనాదికాలం ఈ సంసారములో పడి అలమటిస్తున్నాము.

మన ఆత్మ శరీరము లేకుండా అచిత్తు (కదలలేని వస్తువు) వలే పడియున్న దశలో దయామయుడైన పరమాత్మ ఈ ఆత్మకు శరీరము, అవయవములు ఇచ్చాడు. వీటిని ఎందుకు ఇచ్చాడంటే ఆ అవయవముతో కూడి శరీరముతో తన పాదములను సేవించి బాగుపడాలని, కానీ ఈ జీవుడు పరమాత్మ ఇచ్చిన శరీరాదులను పరమాత్మకొరకు ఉపయోగించక సంసారములో మునిగిపోవుటకే శరీరాన్ని వాడుచు తప్పుదారి పట్టు చున్నాడు. దానివలన అవిద్య (అజ్ఞానం) వల్ల అనేక జన్మలుగా సంపాదించిన పుణ్య పాపరూప కర్మలద్వారా అనేక జన్మలనెత్తుచు సంసారములో పడి దు:ఖపడుచున్నాడు. అంతేకాక ప్రతీ జన్మలోనూ మరింత పాపములను చేయుచు అనాది కాలంగా సంసారములో పడియున్నాడు జీవుడు. అయిననూ వీనికి పాత జన్మలు తెలియకపోవుటచే ఇప్పటికి ఇన్ని జన్మలనుంచీ ఈ సంసారములో కష్టాలు పడుచున్నాను అని బాధలేక తిరిగి తిరిగి ఏడు అవస్థలనూ పొందుచున్నాడు.

ఏడు అవస్థలనగా 1. గర్భవాసము 2. జన్మించుట, 3. బాల్యము 4. యవ్వనము, 5. వార్ధక్యము (ముసలితనం), 6. మరణము 7. నరకము. ఇట్లు ఈ ఏడు అవస్థలు పడుచు ప్రతీ అవస్థలోనూ దుఃఖమునే అనుభవించు చున్నాడు.

ఇట్లు సంసారములో పడి మునిగితేలుచున్న ఈజీవులను ఉజ్జీవింపజేయుటకు ఎప్పుడూ పరమాత్మ ప్రయత్నము చేయుచునే యుండును. అట్టిప్రయత్నములో భాగంగా ఈ జీవుడు జన్మించేటపుడు పరమాత్మ వీనిని విశేషంగా కటాక్షించును. దీనికే "జన్మజాయమాన కటాక్షము" అని పేరు. ఏజీవుడైతే పుట్టుసమయములో పరమాత్మ యొక్క విశేష కటాక్షమును (జన్మజాయమాన కటాక్షమునకు) పాత్రుడగునో వానికి రజోగుణము మరియు తమో గుణము అణగిపోయి వాడు సాత్వికుడగును. ఇలాంటివానికి మోక్షము

పొందాలనే ఆసక్తి కలుగును. కానీ ముముక్షువైన (మోక్షము నందు ఆశగలవాడైన) జీవునకు మోక్షము కలగాలంటే వీనికి తప్పకుండా తత్వజ్ఞానము (తత్వములను గురించి తెలియుట) కావలెను. తత్వమనగా స్వభావము. మన సంప్రదాయములో ప్రధానమైన వస్తువులయొక్క స్వరూప స్వభావములను తెలుసుకొనుటయే తత్వజ్ఞానము. ఇది తెలియనిచో మోక్షము లభించదు. మరి దీనిని తెలుసుకొనుట ఎట్లు అంటే? దీనికి రెండు మార్గాలున్నాయి అవి ఏమనగా 1. శాస్త్రము ద్వారా తెలుసుకొనుట. 2. ఉపదేశముద్వారా తెలుసుకొనుట. శాస్త్రమును అధ్యయనంచేసి ఈతత్వజ్ఞానము సంపాదించుట చాలా కష్టముతో కూడుకున్న పని. అంతేకాక మనం మందమతులము మరియు మందాయుశ్శు కలవారము ఆపైన ఈ శాస్త్రాధ్యయనము చేయునపుడు కలుగు ఆటంకములు కూడా చాలా ఎక్కువగా కలుగును. శాస్త్రాధ్యయనము చేయుటకు అందరికీ అవకాశముకూడా లేదు. కనుక శాస్త్రములద్వారా తత్వ జ్ఞానము సంపాదించుట అసాధ్యము. ఇదే తత్వజ్ఞానమును ఆచార్య ఉపదేశము ద్వారా తెలుసుకొన్నచో పైన చెప్పిన ఇబ్బందులేమీ ఉండవు కదా! కనుక మన పెద్దల్లో సకలశాస్త్ర నిపుణులు, మనందరం బాగుపడాలనే ఆశకలవారు అయిన "పిళ్ళైలోకాచార్యులు" అను పెద్దలు గొప్పదయతో శ్రుతి (వేదం), స్మృతి (ధర్మశాస్త్రము), ఇతిహాసములు (రామాయణాదులు), పురాణములు మరియు ఆగమముల (స్వామి ఆరాధనా క్రమం తెలుపునవి) మొదలైన గ్రంథములలో విస్తారముగా తెలువబడిన తత్వజ్ఞానమును మనందరకూ సులువుగా, స్పష్టముగా తెలియపరచవలెనని తలచి తత్వ త్రయమను ఒకానొక గ్రంథమును అందించిరి.

అసలు తెలుసుకోవలసిన తత్వములు ఎన్ని? వాటి స్వరూప స్వభావములేమిటి? ఈతత్వములో మనము తెలుసుకోవలసిన అంశములేవి? ఈ తత్వత్రయజ్ఞానము వలన మనకు కలిగే లాభమేమి? అనే విషయాలను మనము క్రమంగా పరమకారుణికులైన "పిళ్ళైలోకాచార్యుల వారి తత్వత్రయము అను గ్రంథముద్వారా క్రమముగా తెలుసుకుని ఉజ్జీవిద్దాము.

ఈ తత్వములు ఎన్ని అనగా ఇవి మూడు తత్వములు. 1. చిత్ తత్వము 2. అచిత్ తత్వము 3. ఈశ్వర తత్వము. ఈ మూడింటి సమాహారమే తత్వత్రయము. ఈ మూడింటి స్వరూప స్వభావములను వివరించుటకే 'పిళ్లైలోకాచార్యుల వారు" తత్వత్రయము అను గ్రంథమును మనకు కరుణతో అందించిరి. చిత్ అనగా చైతన్యముగల వస్తువు. చైతన్యముగల వస్తువు అనగా జీవుడు అని అర్థము. కనుక చిత్తత్వము అనగా జీవుని (ఆత్మ) యొక్క స్వరూప స్వభావములను తెలుసుకొనుట. దీనిని వివరించుటకు చిత్ ప్రకరణము వచ్చినది.

అచిత్ అనగా చైతన్యములేని వస్తువు. చైతన్యములేని వస్తువు అనగా ప్రకృతి అని అర్థము. కనుక అచిత్తత్వము అనగా ప్రకృతి యొక్క స్వరూప స్వభావములను తెలుసుకొనుట. దీనిని వివరించుటకు అచిత్ ప్రకరణము వచ్చినది.

ఈశ్వరుడు అనగా అందరినీ నియమించేవాడు శ్రీమన్నారాయణుడు అని అర్థము. కనుక పరమాత్మ యొక్క స్వరూప స్వభావములను ఈ తత్వమును తెలుపును. దీనిని వివరించుటకు ఈశ్వర ప్రకరణము వచ్చినది.

# విష్వక్సేనం తమాశ్రయే

(13వ పేజీ తరువాయి) ఆరాధనలో యజ్ఞోపవీతం సమర్పించకపోవడం గమనార్హం. ఇది భృగుమహర్షి విరచిత వాసాధికార గ్రంథములోని అంశమని వైఖానస శ్రీవైష్ణవ ఆచార్యుల మాట.

ఇక పాంచరాత్రాగమం ప్రకారం విష్వక్సేనులను శతాధికమైన ద్విరదవక్త్రులైన పరివారం సేవిస్తూ ఉంటారు. ఈ విష్వక్సేనుడు సర్వవిఘ్నములను తొలగించి శ్రీహరి భక్తులను స్వామి సన్నిధికి చేరే మార్గం సుగమం చేస్తాడు. శ్రీమన్నారాయణుని కార్యక్రమాల రూపకల్పన బాధ్యతకూడా విష్వక్సేనుడే నిర్వహిస్తాడు. ఈ విష్వక్సేనుని శ్రీ వైష్ణవులు భాద్రపద శుద్ధ చతుర్థి నాడు ఆరాధించడం అనేది లౌకిక ఆచారమే కాని అదే రోజు విష్వక్సేన అవతారం వచ్చిందనే కారణం కాదు. శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ సంప్రదాయంలో ఏ కార్యక్రమమైనా విష్వక్సేన ఆరాధనతోనే ప్రారంభమగుననే విషయం జగద్విదితం.

ఈవిధంగా శ్రీవైష్ణవ పాంచరాత్ర, విష్వక్సేన సంహిత, శ్రీనారాయణసంహిత వంటి గ్రంథములలో తెలియజేసిన విధంగా శ్రీవిష్వక్సేనుని ఆరాధించి సర్వవిఘ్నములను తొలగించుకొని శ్రీమన్నారాయణుని సేవించి తరించడమే భువి మానవ జన్మకు సార్థకత. ★

గీతామృతం



# కృష్ణం వందే జగద్గురుం

భగవద్గీత ఆవిష్కరణకు పూర్వరంగమే యుద్ధారంభమున అర్జునునికి కల్గిన విషాదము, దు:ఖము. సంసారమునందు ప్రతీ ప్రాణి సుఖ దు:ఖములను అనుభవించవలసియే ఉంటుంది. అనుభవిస్తూనే ఉన్నారు. దు:ఖానుభవమే తాత్విక చింతనకు బీజము కావాలి. ఇది అర్జుననిలాంటి ఏ కొందరిలోనో కలుగుతుంది. అర్జునుని మానసికస్థితి శ్రీకృష్ణునిని తత్వబోధచేత విషాదము నుండి వివేకము వైపు జ్ఞానోదయమునకు పురోగతి చెందినది. అర్జునునికి యుద్ధరంగమున స్వధర్మాచరణకై శ్రీకృష్ణుడిచేత అనుగ్రహించబడి ఈ గీతోపదేశము మానవులందరికీ వర్తిస్తుంది. ఇదే సకల మానవ జాతి ఉన్నతికి మార్గదర్శకము కూడా. అందుకే సర్వమతసహనమును, సామరస్యమును, శాంతియుతమైన లౌకిక జీవన విధానమును బోధించే నైతిక గ్రంథము భగవద్గీత.

మానవుడు ఏ దేవతను ఆరాధించినా వారికి కావల్సిన శ్రద్ధ, ఫలితమును నేనే ఇస్తాను అని శ్రీకృష్ణుడు "యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయా అర్చితుమిచ్ఛతి" అని అంటాడు.

కృష్ణార్జున సంవాదరూపమైన భగవద్గీత ఎక్కడైతే ఆచరించబడుతుందో అక్కడ సంపదలు, విజయము, ఐశ్వర్యము, నిశ్చయాత్మకమైన నీతి ఉంటుంది. ప్రపంచములో దాదాపుగా అన్ని భాషలలోకి అనువదించబడి అత్యంతలోక ప్రియత్వమును పొందిన ఏకైక గ్రంథము గీత.

"ధర్మక్షేత్రే కురుక్షేత్రే" అని భగవద్గీత ప్రారంభమవుతుంది. కురుక్షేత్రము బ్రహ్మవిష్ణుమహేశ్వరులు తపమాచరించిన సరస్వతీనదీతీర క్షేత్రము. కురుక్షేత్ర దర్శనము ముక్తిదాయకమని వామనపురాణము చెపుతున్నది. జగత్తు ధర్మ క్షేత్రము. "సహ యజ్ఞా ప్రజా సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః అనేన ప్రసవిష్యధ్వం" అని భగవానుడు సృష్ట్యారంభములో ప్రజలను అభ్యుదయ మోక్ష సాధనములైన యజ్ఞములతో సహా సృష్టించాడు. జగత్తు కర్మాచరణచేతనే నడుస్తున్నది. కర్మలు శాస్త్రము నిర్దేశించిన విధముగా ధర్మబద్ధమై ఉంటేనే లోకానికి అభ్యుదయము కలుగుతుంది.



"కురు" అనగా "చేయుము" అని నిర్దేశించుట. "కురు కర్మైవ తస్మాత్ త్వం పూర్వైః పూర్వతరం కృతం" నీ పూర్వీకులు ఆచరించిన విధముగానే కర్మలు చేయుము. అని భగవద్గీత నిర్దేశిస్తుంది.

## శ్రీమాన్ ఆచి వేంకట పాండురంగాచార్య

"కుర్వన్ ఏవ ఇహ కర్మాణి జిజీవిషేత్ శతం సమాః" కర్మాచరణచేతనే మానవుడు యావదాయుష్యం జీవించాలి అని ఈశావాస్యోపనిషత్ చెపుతుంది.

"ధర్మేణ పాపం అపనుదతి" ధర్మాచరణతో పాపము (మానవ కల్యాణమునకు ప్రతికూల కర్మ) నశించును అని మహానారాయణోపనిషత్.

"ధర్మ ఏవ హతో హంతి ధర్మో రక్షతి రక్షితః" ధర్మము హతమైనచో జగత్తు హతమగును. ధర్మాచరణచే జగత్తునకు అభ్యుదయము, శ్రేయస్సు కలుగును అని మహాభారతం, మనుస్మృతి తెలుపుతాయి.

మానవులందరూ ప్రతినిత్యమూ సంసారమున అధార్మిక, ఆసురీ శక్తులతో యుద్ధము చేయుచున్నవారే కదా. అంతర్గత అహంకార మమకార భావములు కూడ మానవునికి శత్రువులే. దుర్యోధనుని అహంకారము, ధృతరాష్ట్రుని మమకారము కౌరవ వంశనాశమునకు, శాంతియుత సమాజ జీవన విధ్వంసమునకు హేతువులయ్యాయి.

అధర్మము యెంత బలవంతుడినైనా భయపెడుతుంది. చివరికి నాశము తప్పదు. ధర్మక్షేత్రమునందు అధర్మనిష్ఠులు కౌరవులు జయము పొందలేరు అని భయపడ్డాడు

ధృతరాష్ట్రుడు. కౌరవసేన పాండవసేనకంటే చాలా పెద్దది. భీష్మద్రోణకర్ణాది మహావీరులు, యుద్ధవిశారదులు తన పక్షాన ఉన్నప్పటికీ దుర్యోధనునికి యుద్ధారంభముననే ఓటమి భయము కలిగింది.

"అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితం" తమబలము విజయమునకు సరిపోనిది అని, "మదర్థే త్యక్తజీవితాః" తనకోసము అనేక వీరులు జీవితముపై ఆశ వదులుకొని పోరాడుతున్నారని అన్నాడు. కౌరవుల హృదయములు పాండవ శంఖారావముచే బ్రద్దలయ్యాయి. మొట్టమొదట విషాదము ధృతరాష్ట్రునికి, దుర్యోధనునికి కలిగిందని వారి మాటల్లోనే తెలుస్తుంది.

అర్జునుడు కపిధ్వజుడు. అరివీరభయంకరుడైన హనుమంతుని ధ్వజచిహ్నముగా కలవాడు. ఇది విజయసూచకము. శ్రీరామవిజయమునకు సహకారి హనుమ. లంకలో సింహాసనాధిష్టుడైన రావణుని, ఆయన తేజస్సును చూచి ఆశ్చర్యచకితుడయ్యాడు హనుమ.

"యది అధర్మో న బలవాన్ స్యాత్ అయం రాక్షసేశ్వరః
స్యాదయం సురలోకస్య సశక్రస్యాపి రక్షితా"

మహా తేజో పరాక్రమశాలియైన రావణుడు అధర్మముచే దుర్బలుడవుతున్నాడని, ధర్మాత్ముడైతే ముల్లోకములను పాలించుటకు సమర్థుడని భావించాడు. అర్జునుడు గుడాకేశుడు. నిద్రా, ఆలస్యములను జయించినవాడు. తమోగుణమును అణిచివేసి సత్వరజోగుణములను అలవర్చుకున్నవాడే అర్జునునివలె, ఏరంగములోనైనా విజయుడు కాగలడు.

ధర్మబద్ధమైన మానవ ప్రయత్నము ఉంటే భగవంతుడు సహకరిస్తాడు. పార్థసారథి యత్నశీలునికి మార్గదర్శకుడు అవుతాడు. భగవంతుడికి హృషీకేశుడని నామము. మానవుని ఇంద్రియములను అనగా బాహ్య అంతఃకరణములను నియమించి సన్మార్గములో నడిపించగలడు భగవంతుడు.

(వచ్చే సంచికలో మరికొంత తెలుసుకొందాము)

## శ్రావణ మాస ఉత్సవాలు




శ్రీ రామానుజ యాగ్నిక పీఠం అధ్యక్షతన శ్రీ భక్త కార్య సిద్ధి హనుమాన్ దేవస్థానం. సుచిత్ర హైదరాబాద్‌లో శ్రీమాన్ శ్రీ గోవర్ధన ప్రవీణ్ కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో శ్రావణ మాస ఉత్సవాలు నిర్వహించబడ్డాయి.

# పుస్తక పరిచయం

## శ్రీమద్రామాయణము

(మహాకవి వాల్మీకిమహర్షి విరచిత)

"పునాతి భువనం పుణ్యా రామాయణ మహానదీ" అని అన్ని సాంప్రదాయాల్లోనూ శ్రీ రామాయణ పారాయణము. సకల అభీష్ట ప్రదాయకము పుణ్యప్రదమని చెప్పబడుతున్నది. ప్రతి గృహంలో శ్రీరామాయణ గ్రంథము ఉండి తీరాలని ప్రతి ఒక్కరు విశ్వసిస్తారు. శ్రీరామాయణానికి అనేక సంప్రదాయాల్లో అర్థ వివరణతో వ్యాఖ్యాన గ్రంథాలు ఉన్నాయి. అట్టి సుదీర్ఘ గ్రంథాలకు మూల్యం కూడా ఎక్కువే. ఆధ్యాత్మిక గ్రంథ పరిచయం గల వారికి "గీతా ప్రెస్ గోరఖ్ పూర్" సుపరిచితమై ఉంటుంది. వీరి ప్రచురణలో అన్ని భాషలలో సంపూర్ణ శ్రీరామాయణం లభిస్తుంది.



తెలుగులో 700, 750, 850, పేజీలతో 35 పేజీల అనుబంధ పుస్తకంతో కలిపి నాలుగు పుస్తకాలు గా సంపూర్ణ శ్రీరామాయణం ఆన్లైన్లో మనకు లభిస్తుంది. దీని వెల 950 రూపాయలు మాత్రమే. అందమైన వర్ణ చిత్రాలతో ముఖచిత్రపుటలతో విలువైన పేపర్, స్పష్టమైన ముద్రణతో ఈ గ్రంథాలు ఉంటాయి. ప్రతి పేజీలో రెండు విభాగాలుగా వాల్మీకి రామాయణ మూల శ్లోకాలు, మరోవైపు సంక్షిప్త శ్లోకార్థము వివరించబడ్డాయి. తెలుగు అనువాదము చేసినవారు డాక్టర్ ఎం కృష్ణమాచార్యులు డాక్టర్ గోలి వెంకటరామయ్య. మొదటి భాగంలో బాలకాండము, అయోధ్యకాండము రెండవ భాగంలో అరణ్య, కిష్కింధా, సుందరకాండములు మూడవ భాగంలో యుద్ధ ఉత్తరకాండములు ముద్రించబడ్డాయి.

ఒక గ్రంథము 350 రూపాయలు మరు రెండు గ్రంథములు ఒక్కొక్కటి 300 రూపాయలుగా వెల ఇవ్వబడింది. ఆన్లైన్ లో గీత ప్రెస్ వారి వెబ్సైట్లో లభిస్తుంది.

# విఘ్న నివారణ చతుర్థి

ప్రత్యేకం

భాద్రపద మాసం అనేకమైన ప్రత్యేకతలు కలిగిన మాసం. పూర్వాభాద్ర నక్షత్రం గానీ ఉత్తరాభాద్ర నక్షత్రం గానీ కలిగినటువంటి పూర్ణిమ గలిగిన మాసం భాద్రపద మాసం.

ఈ మాసంలో దేశవ్యాప్తంగా అందరూ ఆచరించే పండుగ వినాయక చవితి. విఘ్నేశ్వరుని గజముఖుడుగా ఉండే స్వామిగా ఆరాధించే ఆచారం అన్ని చోట్ల కనిపిస్తుంది. ఈ వినాయక చవితికి ఇటువంటి ప్రాధాన్యం కలగడానికి కారణం ముఖ్యంగా మన భారతదేశంలో స్వాతంత్ర్య ఉద్యమ సందర్భంలో బాలగంగాధరతిలక్ మొదలైనవారు ప్రధానంగా ఈ పండుగను అందరూ ఆచరించే వేడుకగా జరిపే విధానంతో మహారాష్ట్రలో ప్రారంభించారు. అలా ప్రారంభించబడి ప్రత్యేకంగా గణపతి నవరాత్రులు జరుపుకునే పద్ధతి విస్తృతంగా వ్యాప్తి పొందింది. నిజానికి భాద్రపద శుద్ధ చతుర్థినాడు అన్ని సంప్రదాయాలలోనూ ఆచరిస్తూ విఘ్న నివారణ కోరే చతుర్థిగా భావిస్తారు. "విఘ్నేశ్వరుడు" అని ఈ వినాయక చవితి పండుగను వారి వారి సాంప్రదాయరీతుల్లో ఆచరించటం కనిపిస్తుంది.

"శ్రేయాంసి బహు విఘ్నాని" అని మంచి పనులు జరిగే సందర్భంలో వాటికి అనేక విఘ్నాలు రావడం చూస్తుంటాము. ఒక మంచి పని ప్రారంభించేటప్పుడు అనేక ఆటంకాలు కలగటం, వాటిని తొలగించుకోవడం అక్కడ ఉండే వారి సామర్థ్యాన్ని అనుసరించి అవి తొలిగి నిర్విఘ్నంగా పరిసమాప్తం అవడం చూస్తుంటాం! ఈ ఆటంకాలే విఘ్నాలు. ఈ విఘ్నాలను తొలగించే ఒక దేవతగా గజాననుడిని పూజిస్తారు.

ఒక మంచి పని ప్రారంభించేటప్పుడు అనేక ఆటంకాలు కలగటం, వాటిని తొలగించుకోవడం అక్కడ ఉండే వారి సామర్థ్యాన్ని అనుసరించి అవి తొలిగి నిర్విఘ్నంగా పరిసమాప్తం అవడం చూస్తుంటాం!

ఈ ఆటంకాలే విఘ్నాలు ఈ విఘ్నాలను తొలగించే ఒక దేవతగా గజాననుడిని పూజిస్తారు.

ఈ గజాననుడు పార్వతి తనయుడని లోకంలో ప్రసిద్ధము. ఈ పార్వతి తనయుడు గజాననుడు పుట్టడానికి ముందు విఘ్నాధిపతిగా ఎవరున్నారు? అన్నప్పుడు సర్వవిఘ్నాలను తొలగించువాడు భగవంతుడు పరమాత్మయగు శ్రీమన్నారాయణుడే! అని తెలుస్తున్నది. ఏ సాంప్రదాయం వారైనా గజాననుని ఆరాధించు వారైనా విష్ణు పార్శ్వముగా విష్ణుసేనాధిపతి విశ్వక్సేనుని విఘ్నాధిపతిగా ఆరాధించు వారైనా ముందుగా మహావిష్ణువునే ప్రార్థించాలనేది ఆచారం.



**శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి,** స్థానాచార్యులు
శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం

"శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం।
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాన్తయే॥"

అని మహావిష్ణువు రూపాన్ని స్మరిస్తూ, తెల్లనైన అంబరాలు (వస్త్రములు) ధరించిన, తెల్లని వర్ణంలో ఉన్న నాలుగు భుజాలు కలిగిన ప్రసన్నమైన ముఖంతో ప్రకాశిస్తున్న విష్ణువును విఘ్నములు తొలగటం కోసం ప్రార్థిస్తున్నాను.

అది శైవులయితే "అగజానన పద్మార్కం గజానన మహర్నిశం।
అనేక దం తం భక్తానాం ఏకదంత ముపాస్మహే॥"

అని విష్ణు ప్రార్థన తర్వాత 'అగజా' అనగా పర్వత పుత్రి అయినా పార్వతీదేవి యొక్క పద్మము వంటి ముఖమును ప్రకాశింప చేసే సూర్యుని వంటి వాడు విఘ్నేశ్వరుడైన ఏనుగు ముఖము కలిగిన వాడిని నిరంతరం పగలు రాత్రి కూడా ప్రార్థిస్తాను. తన భక్తులైన వారికి అనేక శుభములను ప్రసాదించువాడు. ఏకదంతుడుగా ఉంటాడు అని పార్వతీ పుత్రుడగు గణపతిని గజాననుని ప్రార్థించి ధ్యానం చేస్తారు.

వైష్ణవులైయినవారు (విశ్వక్సేనుని ఆరాధించువారు) విష్ణు

# విఘ్న నివారణ చతుర్థి

ప్రార్థన అయిన వెంటనే

"యస్య ద్విరద వక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతం।
విఘ్నం నిఘ్నన్తి సతతం విష్వక్సేనం తమాశ్రయే॥"

అని ప్రార్థిస్తారు. విశ్వక్సేనుని సైన్యంలో అనేక మంది గజముఖులు ద్విరద వక్త్రులు ఉన్నారు. (ద్విరద మనగా ఏనుగు అని అర్థం) అనేక వేల మంది గజముఖులతో కూడిన విశ్వక్సేనుని, చతుర్భుజాలతో విష్ణువు వలె ప్రకాశించే విశ్వక్సేనుని ఆశ్రయిస్తున్నాను. అని వైష్ణవులు విఘ్నములు తొలగుటకై ప్రార్థిస్తారు.

గజాననుడు పుట్టక ముందు నుండే విశ్వక్సేనుని ఆరాధించే ఆచారం ఉంది అని తెలుస్తుంది. విశ్వక్సేనుడుగా ఉండే మహావిష్ణువును ఆరాధించే విధానం మొదటినుండీ కనిపిస్తూ ఉన్నది. ఎందుకనగా

"తదేవలగ్నం సుదినం తదేవ
తారాబలం చంద్రబలం తదేవ
విద్యాబలం దైవబలం తదేవ
లక్ష్మీపతేంఘ్రియుగం స్మరామి"



అంటూ లక్ష్మీపతి అయిన భగవంతుని విఘ్నములు తొలగుటకు ప్రార్థించటం ముందు నుండి కనిపిస్తోంది. తర్వాతి కాలంలో పార్వతి తనయుడు గజముఖుడు అవతరించిన తర్వాత ఆయన చేసిన గొప్ప కార్యం వలన గణాధిపత్యాన్ని పొందాడు అని కథ ప్రాచుర్యంలో ఉంది.

గణపతికి, కుమారస్వామికి గణాధిపత్యానికి ఎవరు అర్హులు? అనే పోటీ ఏర్పడినప్పుడు భూప్రదక్షిణ పూర్తిగా చేసిన వారికి గణాధిపత్యం వస్తుంది అని పోటీ ఏర్పడగా అందులో ముందుగా బయల్దేరిన కుమారస్వామి నెమలి వాహనంపై భూప్రదక్షిణ చేయడానికి బయలుదేరాడు.

గజాననుడైన వినాయకుడు స్థూల శరీరుడు, మూషిక వాహనుడు అయినందున తాను భూప్రదక్షిణం చేయటం అసాధ్యమని చింతించిన ఆయనకు పరమ శివుడు చెప్పాడు. "అష్టాక్షరీ మంత్రాన్ని జపిస్తూ తల్లిదండ్రులమైన మా చుట్టూ ప్రదక్షిణ చేస్తే నీకు భూప్రదక్షిణ చేసిన ఫలం లభిస్తుంది అని" చెప్పాడు. అది విని గజాననుడు పరమశివుని వద్ద అష్టాక్షరీ మంత్ర ఉపదేశాన్ని పొంది, ఆ నారాయణ మంత్రాన్ని జపిస్తూ పార్వతీ పరమేశ్వరుల చుట్టూ ప్రదక్షిణం చేశాడు. కుమారస్వామి ఆయా తీర్థములు తిరిగి వచ్చే లోపల తనకంటే ముందే వచ్చి ఆయా చోట్ల గణపతి తిరిగి వచ్చినట్టు ఆయనకు కనిపించింది. దాంతో ఆశ్చర్యానికిలోనై నారాయణ మంత్రం యొక్క గొప్పతనాన్ని, తల్లిదండ్రులకు విఘ్నేశ్వరుడు ఇచ్చిన గౌరవాన్ని చూసి గణాధిపత్యాన్ని గణపతికే ఇచ్చే విధంగా తాను ప్రోత్సహించాడు అని పురాణగాథ కనిపిస్తున్నది. తల్లిదండ్రులను గౌరవించిన గొప్ప బుద్ధిమంతుడు గణపతి. గణపతి, పార్వతి తనయుడైన వినాయకమూర్తిని పూజించే ముందు విఘ్నములు తొలగుట అనేది ఒకటే కాకుండా గొప్ప బుద్ధిమంతుడు కనుక విద్యా బుద్ధులను కోరియే గజాననుని పూజిస్తారు.

విఘ్నాధిపతి ఎవరు అనగా పరమాత్మ, అంతేగాక బ్రహ్మవైవర్త పురాణం మొదలైనటువంటి వాటిలో సాక్షాత్ మహావిష్ణువే గజాననుడుగా అవతరించాడు. పార్వతీదేవి మహా విష్ణువు వంటి పుత్రుడు కలగాలని ప్రార్థించగా గజముఖుడుగా అవతరించాడనే కథ పురాణాంతరాల్లో కనిపిస్తుంది.

వినాయక చవితి అనే పండుగ నాడు, భాద్రపద శుద్ధచవితి నాడు పార్వతీ తనయుడైన గజముఖుని ఆరాధించటంతో పాటు వైష్ణవులు అనేకమంది గజముఖులు తన సైన్యంలో గలిగిన విశ్వక్సేనుని ఆరాధించడం ద్వారా విఘ్నాలు తొలగించుకునే పద్ధతిని అవలంబిస్తారు.

మన దేశంలో ముఖ్యంగా వైదికమైన పూజా విధానాల్లో ఐదు రకాల దేవతలను ప్రధాన దేవతలుగా పూజిస్తారు. విష్ణువును వైష్ణవులు, శైవులు శివుని ఆరాధించడం, అలాగే అమ్మవారిని, గణపతిని, సూర్యుణ్ని ఆరాధించే సాంప్రదాయాలు మనకు కనిపిస్తాయి. అవి వైష్ణవం, శైవం, శాక్తేయం, గాణాపత్యం, సౌరం అనే సాంప్రదాయాలు కనిపిస్తాయి. ఈ విధంగా ఆయా సాంప్రదాయాను సారంగా గణపతిని పూజించి విఘ్నములు తొలగించుకొని సకలసామ్రాట్టయిన మహావిష్ణువు అనుగ్రహాన్ని అందరూ పొంది తరించాలని ఆశాసిస్తున్నాము. ★

# జ్యోతిర్విజ్ఞానమ్



## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక

నీళ్లను వాడుకోగలగాలి వాడుకోవాలి కూడా! "ఆపోవా ఇదగ్ం సర్వం విశ్వా భూతాన్యాపః ప్రాణావా అపః పశవః ఆపః సామ్రాడాపో విరాడాపః స్వరడాపః.... సర్వాదేవతాః అని మనకు వేదమంత్రం చెపుతున్నది "ఆపోవా ఇదగుం సర్వం" నీళ్లు లేకపోతే ప్రపంచంలో ఉండే ప్రాణులే లేవు అని నిర్ధారించవచ్చు. నీరు ఎంత గొప్పది అంటే జంతువులలో ఆహారాలు స్వీకరించే విధానాలు వేరువేరు అయినప్పటికీ కొన్ని శాఖాహారులు మాంసాహారాలు అయినప్పటికీ నీరు మాత్రం అన్ని తాగుతుంటాయి. ప్రాణాలు నిలవాలంటేనే నీళ్లు తాగాలి. పంటలకు చెట్లకు నీరు కావాలి. విద్యుత్ దీపాలు వెలగాలన్న నీరే కారణం! అనేక పరిశ్రమలు నడవడానికి అనేక వస్తువులు తయారై మానవ ప్రయోజనాలకు ఉపయోగ పడుతున్నాయి అంటే దానికి నీరే కారణం. అటువంటి నీటిని పాడు చేయకూడదని శ్రీమద్భాగవతంలో ఒక ఉదాహరణగా చెప్తారు శ్రీ కృష్ణ పరమాత్మ.

అలాగే అగ్నిలో కలిషిత పదార్థాలు వేసి దాని వలన వచ్చిన పొగ ఆకాశంలో చేరి రకరకాలైన ఉపద్రవాలకు దారితీస్తుంది. కనుక ఏ వస్తువును అగ్నిహోత్రంలో ఉంచడం ద్వారా ప్రకృతి శుద్ధి జరుగుతుంది ప్రాణికి ఆరోగ్యము ఆయుష్యము యశస్సు పెరుగుతాయి. అనేది మనకు యజ్ఞ యాగాదుల ద్వారా తెలుపుతారు.

అందుకే పరమాత్మ అగ్ని శుద్ధి చేయాలనుకున్నాడు భూ శుద్ధి అయిపోయిన తర్వాత యశోదా నందను లందరూ ఇంటికి వెళ్లిన తర్వాత ఖాళీయుని విష జ్వాలల ద్వారా వనమంతా కలిసితమైనది అని ఇక్కడ ఫలాలు తింటే వీరంతా మరణిస్తారు అని అగ్నిహోత్రం ప్రజ్వరిల్లింది. అగ్నిహోత్రుడు వనాన్ని దహించాడు వన మధ్యలో ఉన్న యశోదా నందనులు యాదవులందరూ కృష్ణ రక్షించుము అనగా శ్రీకృష్ణుడు దావానల భక్షణ చేసి అగ్రిహోత్రం లో ఉండే లోపాలను తొలగించాడు. ఇక అగ్ని శుద్ధి తర్వాత ఆకాశ శుద్ధి జరగాలి ఆకాశమనగా శబ్దము ఇది

మహా ప్రమాదకరమైనది. ఈవేళ రకరకాల విజ్ఞాన సంపదలను పెంచుకుంటున్న విధానంలో రకరకాల రాకెట్లను ఉపగ్రహాలను ప్రయోగిస్తూ దివ్యమైన ఆకాశము కలుషితమవుతున్నది అందువల్ల ఉరుముల మెరుపుల శబ్దాలు కూడా మారుతున్నాయి. అంటే ప్రకృతిలో వర్షాలు సకాలంలో రావడం లేదు. మాట్లాడే మాట చదివే మంత్రము ఆ శబ్దము లు చాలా గొప్పవి. పూర్వము అగ్నిహోత్రంలో అవిసలు వేస్తూ వేదమంత్రాలు చదువుతూ సుస్వరంగా ప్రకృతిని పవిత్రం చేశారు కనుకనే దివ్యమైన వర్షాలు పడి పంటలు పండాయట! ఆ విధంగా శబ్దశుద్ధి కావాలని భావించాడట పరమాత్మ. మురళీ గానం ద్వారా భగవంతుని భక్తులైన గోపికల మనసును రంజింప చేసే పద్ధతిగా మురళీ గానం చేశాడు. అనగా భక్తులైన వారికే భగవన్నామం భజనలు స్మరణలు వినిపిస్తుంటాయి. ఈ విధంగా హూ శుద్ధి జలశుద్ధి అగ్ని శుద్ధి ఆకాశ శుద్ధి చేయాలని భావించాడు పరమాత్మ. తర్వాత తృణావర్తుడనే రాక్షసుడు వచ్చాడు శ్రీకృష్ణుని ఎత్తుకొని వెళ్ళాడు. గాలి కలుషితం అవుతే ఏమవుతుంది అనే విషయం మనకు తెలుసు కలుషితమైన గాలిని కూడా బాగు చేయదలచిన స్వామి అలా తృణావర్త సంహారం చేశాడు అని మనకి భాగవతం తెలుపుతున్నది.

గాలి కలుషితమైతే స్వచ్ఛమైన పల్లెల నుంచి పట్టణాలకు గాలి వెళ్లి కలుషితమై మనము ఎలక్ట్రానిక్ యంత్రాల ద్వారా గాలిని కృత్రిమ గాలిని సృష్టించుకుని అనుభవించుకుని దుర్గతి సంభవిస్తున్నది. అటువంటి గాలి ద్వారా శరీరములు మనసులు ప్రాణములు కలుషితమైపోతున్నాయి. మనము అలంకార వాస్తు గురించి మాట్లాడుకుంటున్నప్పుడు అందులో గాలి కూడా ఒక భాగమే అని గుర్తించాలి అలాగే నీరు నిప్పు ఆకాశము పృథ్వి కూడా ఒక భాగమే అని గుర్తించాలి.

అలాగే మంచి మాట కూడా ఒక భాగమే అని చెబుతున్నది శాస్త్రం (మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

# సతీ అనసూయా దేవి



## తిరుక్కోళూర్ పెణ్ పిళ్ళై రహస్యాలు

**తిరుక్కోళూరు పెణ్ పిళ్ళై చెప్పిన 81 వాక్యరత్నములలోని ఏడవ భక్తురాలైన అత్రి మహాముని భార్య అనసూయా దేవిని గూర్చి పెణ్ పిళ్ళై గారు పలికిన వాక్యం**

**"తాయ్ కోలం శెయ్ దేన్ అనసూయయై పోలె" అంటారు.**

అనసూయాదేవి సీతాదేవికి పట్టు జరీ చీరలు ధరింప చేసి సర్వా లంకార భూషితగా, వాసన పువ్వులు ముడిచి, పసుపు కుంకుమ యిచ్చి, బొట్టు పెట్టి అలంకరించింది. ఆవిధముగా తల్లివలె ఈ దాసురాలు అంటూ ఒక్కొక్క భక్తునితో తనను పోల్చుకుని నైచ్యాను సంధానం అవలంబిస్తున్నారు పెణ్ పిళ్ళై.

వనవాసంలో శ్రీరాముడు సీతా లక్ష్మణులతో అత్రి మహాముని ఆశ్రమం చేరుట, ఆ మహాముని వారికి స్వాగత మర్యాదలను జరిపి అనసూయా దేవి తపఃప్రభావములు తెలుపుట, అనసూయమ్మ సీతమ్మకు స్త్రీ ధర్మాలను వివరించుట మొదలగు విషయాలను పెణ్ పిళ్ళైయి గారు చెప్తున్నారు.

మొట్టమొదటగా శ్రీరాముడు అత్రి మహామునికి ప్రణమిల్లాడు శ్రీరాముని ఆమహాముని పుత్రునివలె ఆదరించాడు. అంత వృద్ధురాలు మహా పతివ్రత అయిన అనసూయా దేవి అచ్చటకు వేంచేసింది. అత్రి మహాముని ఆజ్ఞ మేరకు సీతమ్మను లోపలికి తీసుకొని వెళ్ళింది. ధర్మాత్మురాలు తపస్విని అయిన అనసూయాదేవిని గురించి శ్రీరామునికి వివరిస్తున్నారు మునిసత్తములు.

ఒకానొక సమయంలో వరుసగా పది సంవత్సరములు వర్షములు కురియలేదు. కరువు కాటకములతో లోకములన్నీ తినుటకు తిండి లేక త్రాగుటకు నీరు లేక మలమల మాడిపోయాయి ఆ సమయంలో అనసూయాదేవి కఠోరమైన నియమాలతో తీవ్ర తపస్సు ఒనర్చింది. ఆమె యొక్క తపోశక్తి చేత కంద మూలములను ఫలాలను సృష్టించుటయే గాక గంగానదిని ప్రవహింప చేసి లోకంలో ఆకలి దప్పులను తీర్చింది. ఈమె పదివేల సంవత్సరములు తీవ్రతపము, చాంద్రాయణ వ్రతములను ఆచరించి ఋషీశ్వరులకు వారి తపస్సుకు ఎదురైన విఘ్నాలను తొలగించింది. అంతేగాక దేవకార్య నిమిత్తమై ఈమె పది రాత్రులను ఒక రాత్రిగా మార్చి వారికి సహాయపడింది. ఈ మహితాత్మురాలు మీకు తల్లి వంటిది ఎన్నడు కోపము ఎరుగని శాంతమూర్తి. పెద్ద ముత్తైదువ.

**శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు, రాజమండ్రి.**

ఆమె తన సత్కర్మల చేత అనసూయగా అంటే అసూయ లేనిదిగా ప్రసిద్ధి పొందింది. సీతమ్మతో ఆమెను అనుసరించుగాక అని మహర్షులు పలుకగా శ్రీరాముని ఆజ్ఞ మేరకు సీతమ్మ అనసూయాదేవికి నమస్కరించింది. వృద్ధురాలగు అనసూయాదేవి అవయవములు పట్టుదప్పి చర్మం ముడతలు పడి తల వెంట్రుకలు నెరసి శరీర అంగములు వణికి పోతుండెను సీతమ్మ తన పేరును తెలియజేసి ఆమె క్షేమము గూర్చి అడిగింది.

ఆమె సీతమ్మను చూసి సంతోషించి ఓదార్పుగా 'సీత నీవు ధర్మమార్గము అనుసరిస్తున్నావు. ఓ భామిని! నీవు బంధువులను వివిధ సంపదలను త్యజించి వనములకు పంపబడ్డ నీ భర్త రాముని అనుసరించు భాగ్యశాలివి. ఎటువంటి వాడైనా భర్తను ప్రేమతో అనుసరించు స్త్రీకి ఉత్తమ లోకములు ప్రాప్తించును. ధనహీనుడైనా పతి ఉత్తమ స్వభావము కల స్త్రీకి దైవము. నీ పతి అయిన శ్రీరామునికి సేవలందించుము అదియే పతివ్రతా ధర్మంగా నీవు చక్కని కీర్తి ప్రతిష్ఠలను, ధర్మ ఫలములను పొందగలవు అని అనసూయాదేవి అంటుంది. వెంటనే సీతాదేవి తన పతి అయిన శ్రీరాముని గుణములు శ్లాఘనీయమని దయాళువని జితేంద్రియుడని సకల ప్రాణుల యెడ అనురాగము కలవాడని ధర్మ నిరతుడని ప్రేమాస్పదుడని కన్నతల్లియగు కౌసల్యా మాతయందు భక్తి భావం కలవాడని పితృభక్తి పరాయణుడని తెలుపుతూ "ఓ ధర్మాత్మురాల నీవు నాతో పలికిన ఈ మాటలు మా అత్తగారు మా తల్లి నాకు చేసిన ఉపదేశములను జ్ఞప్తికితెస్తున్నాయి. పతిని సేవించుట స్త్రీకి గొప్పతపస్సు దానికి మించిన తపస్సు (మిగతా 26వ పేజీలో)

# వరహావతార ప్రయోజనం



శ్రీమాన్ శ్రీ కలకుంట్ల వరప్రసాదాచార్యులు

"తస్య యజ్ఞవరాహస్య విష్ణో రమితతేజసః
ప్రణామం యేపి కుర్వంతి తేషామపి నమో నమః"

మన మొరలను విని విన్నది విన్నట్టుగా స్వామికి చెప్పి మనకు శ్రేయస్సును కలిగిస్తుంది లక్ష్మీ దేవి. కాబట్టే 'శృణోతి శ్రావయతీతి శ్రీః' అని నిరంతరం నిత్యానపాయినిగా స్వామితో శబ్ద అర్థములవలె కూడి ఉండే లక్ష్మీదేవి ప్రత్యేకతను సూచించేది శ్రావణ మాసం. ఈ మాసంలో ఆబాల గోపాలం అనుభవించే శ్రీకృష్ణ హయగ్రీవ వరాహ జయంతులను వైభవంగా జరుపుకున్నాము. అందులో వరహావతార ప్రయోజనాలను తెలుసుకుందాం!

అవతారం అనగానే పైన ఉన్నవాడు క్రిందికి దిగుట అని అర్థం. భగవంతుడు అవతరిస్తున్నాడు అనగా వైకుంఠం అనే మిక్కిలి ఎత్తైన చోటు నుండి పాలసముద్రంకు దిగి అక్కడినుండి మానవులపై కరుణతో సుర నర తిర్యక్ స్థావర రూపముగా ప్రత్యక్షం అవుతున్నాడు.



భగవంతుని అవతారములు అనంతములు కానీ భాగవతములో 25 అవతారాలు ప్రస్తావించబడినవి. వాటిలో ముఖ్యమైనవి 10 అవతారాలు. వీటిని ఆళ్వారులు తేవుద్దెయ, మీనమాయ్, ఆమ్మైయామ్, ఏనమాయ్, అరియామ్, కురళాయ్, మూవురువిల్, ఇరామనాయ్, క్కణ్ణనాయ్, కర్కియాయ్ అని మత్స్యాదిమూర్తులుగా పెరియాళ్వార్లు తెలుపుతారు. దీనినే నమ్మాళ్వార్లు "ఎన్నెన్ని యోనియమాయ్ పిరందాయ్" అంటూ ఎన్ని జాతులలో అవతరించావో అని స్తుతిస్తారు.

అన్ని అవతారాలు ఒక ఎత్తు కానీ వరాహ స్వామి అవతారం ఒక ఎత్తు. ఈవృత్తాంతాన్ని పురాణాలు మరియు శ్రీమద్ భాగవతం వరాహ మహాత్మ్యాన్ని అద్భుతంగా వర్ణిస్తాయి. వరాహః అనే సంస్కృత పదానికి తెలుగులో పంది అని జంతు జాతు లన్నింటిలో నీచమైన జాతిగా మనం భావిస్తాం. కానీ భగవంతుని దయా గుణానికి హద్దు లేదు అందుకోసం ఈ అవతారంలో పరమపదనాథుడు శ్రీమన్నారాయణుడు అవతరించాడు.

అది అతని సౌలభ్య దయా గుణానికి సూచకం అని తెలుసుకోవాలి. విష్ణు పురాణం 'వరాహః' అనగా గొప్ప క్షేత్ర మయిన భూమిని అహంతి తీసుకువచ్చినవాడు అను అర్థం తెలుపుతుంది. ఈ అవతార వైభవాన్ని శ్రీమద్భాగవతము లో శుకమహర్షి చక్కగా వివరిస్తాడు. హిరణ్యాక్షుడు భూమాతను ప్రళయ సముద్రంలో ఉంచి జయిస్తే ఆ సమయంలో బ్రహ్మ తన పుత్రుడైన స్వాయంభువ మనువును సృష్టికార్యాన్ని ప్రారంభించమని ఆజ్ఞాపించగా భూమిని దుష్ట రాక్షసుడు హిరణ్యాక్షుడు నీటిలో బంధించిన విషయాన్ని చెప్పి బ్రహ్మను ఇలా ప్రార్థిస్తాడు.

"యదోకః సర్వసత్వానాం మహీ మగ్నా మహాంభసి
అస్య ఉద్ధరణీ యత్నో దేవ దివ్యా విధీయతాం" అని. దీనినే వేదం "ఆపోవా ఇదమగ్రే సలిల మాసీత్ తస్మిన్ ప్రజాపతి ర్వాయు భూత్వా అచరత్ స ఇమామపశ్యత్ తాం వరాహో భూత్వా అహరత్"

అప్పుడు బ్రహ్మ భూమిని సముద్రం నుండి పైకి తీసుకురావడం కోసం తన నాసికాపుటం నుండి బొటనవేలంత చిన్న వరాహాన్ని ఆవిర్భవింప చేస్తాడు.

"వరాహతోకః నిరగాత్ అంగుష్ఠః పరిణామకః
గజమాత్రః ప్రవవృధే తదద్భుత మభూన్మహత్"

ఆ చిన్ని వరాహం చూస్తుండగా వృద్ధి పొందుతూ పెద్ద ఏనుగు ఆకారం పొందింది. అలా ఆ దుష్ట రాక్షసుడిని

సంహరించి భూమిని రక్షించి మనలను కాపాడిన స్వామి ఆదివరాహస్వామి. "అద్భుతాహి వరాహేణ కృష్ణేణ శత బాహునా" అని 100 చేతులతో గల వరాహమూర్తిచే భూమిగా నీవు ఉద్ధరించబడ్డావు.

ఇక్కడ కృష్ణ శబ్దానికి వరాహమూర్తిగా తెలుపుతుంది వేదమాత "కృషి ర్భూవాచకః శబ్దః ణస్తు నిర్వృతి వాచకః విష్ణుస్తద్భావ యోగాచ్చ కృష్ణ ఇత్యభిధీయతే" అనగా విష్ణు ఆనంద రూపి కనుక భూమికి ఆనందాన్ని కలిగించినందుకు కృష్ణ అని సంబోధించింది. వరాహ స్వామి భూమిని ఉద్ధరించిన వైనాన్ని నమ్మాళ్వార్లు తిరువాయిమొళిలో "నాన్గిళవేళ మణ్ణుమ్ తానత్తవే పిన్నుమ్ నాన్గిలఏళ మలై తానత్తవే" అంటారు. భూమిని ఉద్ధరించిన సమయంలో వరాహస్వామి పెద్దనైన భూమిని ఎత్తడానికి దానికంటే పెద్దనైన దేహాన్ని ధరించి తన కోరలతో జాగ్రత్తగా ఎత్తి భూమిలోని ఒక రేణువు కూడా కదలకుండా నీరు కూడా చెదరకుండా "నిష్కంప నిత్య స్థితిః" అన్నట్లుగా భూమిని పుష్పము వలె ఎత్తి తన కోరలతో ధరించాడు అని భావం.

శ్రీమద్ భాగవతంలో యజ్ఞ వరాహ స్వామి అని ఋషులు స్తుతిస్తారు. "త్రయీమయీ రూపమిదించ సౌకరం" అని (భూమిని ఉద్ధరించిన స్వామి దేవాది దేవా దంతములపై భూమిని ధరించియున్న నీ యొక్క వేదమయమైన యజ్ఞ వరాహ రూపం పర్వతము వలె శోభించుచున్నది). అలానే గీతలో శ్రీకృష్ణుడు "అహం హి సర్వ యజ్ఞానాం భోక్తాచ ప్రభురేవ చ" నేనే అన్ని యజ్ఞాల ఫలాలను భుజించే వాడను యజ్ఞములకు యజమానిని మరియు యజ్ఞ ఫలాన్ని ఇచ్చేవాడిని అని అంటాడు. యజ్ఞవరాహస్వామిని స్తుతిస్తూ విష్ణు పురాణంలో

"పాదేషు వేదా స్తవమూల దంష్ట్ర
దంతేషు యజ్ఞాశ్రిత యాశ్చ వక్త్రే
కుత ఆశ జిహ్వాసి తనూరిహాణి
దర్భాః ప్రభో యజ్ఞ పుమాన్ త్వమేవ

అనగా వరాహస్వామి నాలుగు పాదాలు నాలుగు వేదాలుగా అతని కోర దంతము యజ్ఞ యూపస్తంభముగా యాగంలో సమర్పింపబడే హవిస్సును భుజించే అతని దంతాలు యాగాలుగా ఎర్రగా పొడుగ్గా ఉండే నాలిక హోమ అగ్నిగా వెంట్రుకలు దర్భలుగా యజ్ఞానికి కాలమైన పగలు రాత్రి అతని రెండు నేత్రములుగా హోమ సాధనంగా ఉండే స్రుక్ అతని ముక్కుగా వర్ణిస్తారు. (ఇంకావుంది)


# స్టాచ్యూ ఆఫ్ యూనియన్



శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారిచే యు.యస్ లో 90 అడుగుల స్టాచ్యూ ఆఫ్ యూనియన్ హనుమాన్ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ఆగస్టు 18న వేలాది భక్తులు శ్రీరాముడు హనుమంతుని నామాలు ఏకధాటిగా జపిస్తుండగా భక్తి వాతావరణంలో వేడుకగా కార్యక్రమం జరిగింది. హనుమాన్ ముందు భాగంలో నిలబడి దేశభక్తి గీతాలు మరియు జాతీయ గీతాలు వందేమాతరం జన గణ మన, మరియు యు.యస్. గీతాన్ని గౌరవప్రదంగా సామరస్యంతో ఆలపించటం అందరిని ఆకట్టుకుంది.







# అష్టలక్ష్మీ వైభవం




## శ్రీమతి వంగల రాధిక


శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజమాసములలో. లక్ష్మీ పూజ చేసే ఆనవాయతి చాలా మందికి వుంది. లక్ష్మీదేవి సిరుల నిచ్చే తల్లి. నారాయణుడనే పరమాత్మను పొందాలంటే, పిరాట్టి ఉపకారము మనకు కావాలి. దానికి ముందు మనమెవరమో తెలుసుకోవాలి. మనమెందుకు జననమరణ భ్రమణములో పడి ఇన్ని ఇడుములు పడుతున్నామో తెలియాలి. అది పోవాలంటే పరమాత్మను ఆశ్రయించాలి. అందుకు ఆ పరమాత్మ స్వరూపము తెలియాలి. ఆత్మ స్వరూపము పరమాత్మ స్వరూపము, అన్నీ తెలుసుకొన్న తరువాత, ఆయనను ఎలా దరి చేరాలో, ఆశ్రయించాలో తెలియాలి. ఆశ్రయించే దారిలో వున్న అడ్డంకులేమిటో బోధ పడాలి. అవి మనలను ఎలా పరమాత్మ దరి చేరనివ్వకుండా దారి తప్పిస్తున్నాయో కూడా తెలుసుకోవాలి. పరమాత్మ దరి చేరడానికి నియంతృత్వము అడ్డము. మనపట్ల పరమాత్మకు దయ గలిగేటట్లు, మన దోషాలను ఎంచకుండా వుండునట్లు చేసేవారుండాలి. అప్పుడే పరమాత్మను చేరగలిగేది.మనకు దానివల్ల ప్రయోజనమేమిటి? సంసారములో దుఃఖము లేకుండా వుండడమా? నిరతిశయ ఆనందం ఇచ్చే కైంకర్యమును, మన స్వరూపజ్ఞానమును తెలుకొని చేయడమా? దానికే పిరాట్టి పురుషకారము చాలా ముఖ్యము.

మన తప్పిదములను మన్నించమని చెప్పి, అకారవాచ్యుడైన పరమాత్మతో పిరాట్టి చేరి వుంటుంది. పరమాత్మ జగత్తుని సృష్టించడము ఆవిడ ప్రోత్సాహముతోనే, ఆవిడ అంగీకారానుగుణముగా, ఆవిడ సంతోషానికే. “అంగీకారిభిః ఆలోకైః సార్థ యంత్రైః కృతోంజలి॥” అని. ఎలా సృష్టి కార్యం చేస్తారో, దానికి శ్లోక ప్రమాణమున్నది. “యద్భ్రూభంగాత్ ప్రమాణం, స్థిరచర రచనా, తారతమ్యైః మురారేః” అని పిరాట్టి కనుబొమల కదలికల ననుసరించి, దేవలోకము, భూపాతాళాది లోకములను సృష్టిస్తారట పరమాత్మ! అలా సృష్టి కార్యాది పూర్వమునుంచి , అనాదిగా వుండే పిరాట్టి ఆది లక్ష్మి!

“విద్యా లక్ష్మి” మనకు జ్ఞానమనే వెలుగును చూపే పిరాట్టి. 32 విద్యలు లోకములో చెప్పబడ్డాయి. అన్నీ పరమాత్మ దరికి మనలను చేర్చేందుకు సహకరించేవి. జ్ఞానమయమైన మార్గమును చూపేవి! సద్విద్యా, దహరవిద్యా, భౌమవిద్యా, శాండిల్య విద్యా, మొదలైన ఉపాసన మార్గాలు. ఆ వుపాసన మార్గముల కంతా మూల స్వరూపమై, వాట్లను మనకు అందించే మాతగావిద్యా లక్ష్మి గా పిరాట్టి అలరారు తున్నారు

“కర్మిన్ల నూల్ వలైయుళ్ పట్టిరుంద నూలాట్టి” అని ఆళ్వార్ తన పాశురములో పిరాట్టిని పాడారు. అంటే వేదాలు, దానిలో చెప్పబడిన సారానికంతా ప్రమాణరూపమై వెలసిన పిరాట్టి! అందుకే విద్యాలక్ష్మిగా మనలో జ్ఞాన జ్యోతిని వెలిగించే పిరాట్టి శ్రీమహాలక్ష్మి

“గజలక్ష్మి” పాలకడలినుంచి వేయిరేకుల కమలములో, పిరాట్టి పునః ఆవిర్భవించినప్పుడు, ఎనిమిది దిశలనుండి ఎనిమిది దిగ్గజాలు, ఆవిడమీద పన్నీరు జలములను కురిపిస్తూ, ఆవిడకు పరమాత్మ రారాణిగా సముచిత మర్యాదలను అందిస్తూ వచ్చాయి. అలా గజరాజులతో కైంకర్యము లందుకొంటూ వెలసిన తల్లి కాబట్టి ఆవిడ గజ లక్ష్మి!.

“ధైర్యలక్ష్మి!” ధైర్యం! అంటే ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోగలిగే మానసిక స్థైర్యమేధైర్యము! పరమాత్మ త్రిభువనాధీశుడు ! సకల దేవతల చేత ఆరాధించ బడేవాడు. అంతటి పరమాత్మను, అల్పులమైన మనము చేరగలమా! ఎన్నెన్ని జన్మలనెత్తాము. దానికి కారణము మన పాప కర్మలే కదా! ఇంతటి పాపాత్ముడినైన నేను పరమాత్మ దరి చేరడము, పరమాత్మ ఆదరిస్తారని అనుకోవడము ఎంతటి దుష్కృతము. అని తలచి మనము పరమాత్మ నుండి దూరం జరిగిపోవడానికి ప్రయత్నిస్తాము. అప్పుడు పిరాట్టి, పరమాత్మ సౌలభ్య స్వరూపమును తెలియ పరచి మనకు అజ్ఞానమనే భయమును పోగొట్టి, జ్ఞానపు వెలుగునిచ్చి, మనలను పరమాత్మ దరి చేరుస్తుంది. పరమాత్మను మనము చేరగలమా అనే సంశయాన్ని తీర్చి, మనకు పరమాత్మయందు ధృఢనిశ్వాసాన్ని కలిగించే పిరాట్టియే ధైర్యలక్ష్మి! (సశేషం)



## శ్రీరామాయణంలో ఉపకథలు

# గుహప్పెరుమాళ్



(కిందటి సంచిక తరువాయి)

ధనుర్ధ్ధారులైన రామలక్ష్మణులు సీతాదేవితో గంగానది రేవు దగ్గరికి చేరారు. రామ లక్ష్మణులు వనవాస దీక్షలో భాగంగా గుహుడు తెప్పించిన మర్రిపాలు జుట్టుకు పట్టించి జడలు కట్టించారు. నార చీరలు ధరించి ఋషుల లాగా శోభాయమానంగా ప్రకాశించారు. ముందుగా సీతను నావలోకి ఎక్కించిన తర్వాత రాముడు లక్ష్మణుడు పడవలోకి ఎక్కారు. బయలుదేరే ముందు శ్రీరామచంద్రుడు బ్రాహ్మణులు, క్షత్రియులు జపింపతగిన తనకు క్షేమకరమైన 'దైవీం నావమ్' అనే మంత్రాన్ని జపించాడు. సీత పవిత్ర గంగా నదికి ప్రీతితో నమస్కారం చేసి 'ఓ గంగాదేవి మా వనవాస దీక్ష ప్రశాంతంగా ముగించుకొని సఫల మనోరథినియై క్షేమంగా తిరిగి వచ్చేటప్పుడు సంతోషంతో మళ్లీ నిన్ను పూజిస్తాను' అని చెప్పింది.

అందరూ ఓడలోకి ఎక్కారు. పవిత్రమైన గంగానది సీతారామ లక్ష్మణులు ప్రయాణం చేయడాన్ని చూసి పొంగిపోయి ఒడ్డును ఒరుసుకొని ఆనందంగా ప్రవహిస్తున్నది నది మధ్య ఓడ, ఓడలో సీతారామచంద్రులు, సాక్షాత్ శ్రీమన్నారాయణులు, శ్రీ మహాలక్ష్మి లాగా కూర్చుని ఉన్నారు. సమీపంలోనే లక్ష్మణస్వామి మూర్తీభవించిన దాసత్వంతో నిలబడి ఉన్నారు. ఆ ఓడ తిరుమామణి మండపం లాగా ప్రకాశిస్తున్నది. ఎదురుగుండా కూర్చున్న గుహుడు. ఆయనకు రెప్ప కదలడం లేదు. ఆ దివ్య దంపతులను చూస్తున్న కొద్దీ ఆనందంతో మనసు నిండిపోయింది. చూపు వాళ్ళ మీదే నిలిచి పోయింది, అలవాటుగా నావను నడుపుతున్నాడు. చేతనులందరిని సంసార సాగరం దాటించే ఆ మిథునాన్ని 'ఇద్దరి నుండి అద్దరికి' దాటిస్తున్నాడు గుహుడు. ఆహా ఏమి భాగ్యం! ఈ దేహంతో, ఈ లోకంలోనే వారికి కైంకర్యం చేస్తున్నాడు, అది ఆయనకు సామ్యాపత్తి. పరమపదానికి వెళ్ళినా శ్రీమన్నారాయణ మిథున కైంకర్యం చేయడమే ప్రాప్యం. అది ఇక్కడే గుహుడికి దొరికింది. మన సంప్రదాయంలో పెరుమాళ్ అంటే చక్రవర్తి తిరుమగన్ అంటే చక్రవర్తి కుమారులైన శ్రీరామచంద్రమూర్తి. గుహుడిని కూడా మన పెద్దలు గుహప్పెరుమాళ్ అన్నారు.

### శ్రీమతి చక్రవర్తుల చూడామణి, ఖమ్మం

వనవాస కాలంలో సీతారాముల మిథునానికి కైంకర్యం చేసే భాగ్యం గుహుడికి మాత్రమే లభించింది. హనుమకు, సుగ్రీవుడికి, విభీషణుడికి ఆ భాగ్యం దక్కలేదు. వాళ్ళు రామ లక్ష్మణులనే ముందుగా దర్శించుకోగలిగారు.

ఈ సందర్భాన్ని తిరుమంగై ఆళ్వార్లు ఎలా అనుభవించారో పెరియ తిరుమొళి 5 వ పత్తులో శ్రీరంగం దివ్య దేశానికి మంగళా శాసనం చేసిన 8 వ దశకంలో

"ఏళై ఏదలన్ కీళ్ మగన్ ఎన్నాదిరంగి !మట్రవర్కు ఇన్నరుళ్ శురన్దు !" గుహుడి వైభవాన్ని చక్కగా వివరించారు.

తిరుమంగై ఆళ్వార్ల అభిమతం ఏమిటో చూద్దాం.

జ్ఞాన శూన్యుడు, తాను జీవాత్మ అని, వచ్చినవాడు పరమాత్మ అని, ఆయనకు కైంకర్యం చేస్తున్నానని తెలుసుకోలేని జ్ఞానశూన్యుడైన గుహుడు,

మొరటు వాడు, గుహుడు ఆటవికుడు. చేతిలో ఎప్పుడు ఈటె పట్టుకుని తిరుగు తుంటాడు. ఆఖరికి తల్లిని అన్నం పెట్టమని అడగాలన్నా ఈటెను చూపించి అన్నం పెట్టమని అడుగుతాడు.

కింది స్థాయి వాడు, జ్ఞానం లేని వాడు, ఆచరణ లేని వాడు కాబట్టి కింది స్థాయి వాడు అని భావించకుండా అంటే నువ్వు (శ్రీరాముడు) అతడు జ్ఞానం లేని వాడు, ఆచరణ లేని వాడు కాబట్టి కింది స్థాయి వాడు అని భావించలేదు. పోనీ గుహుడు తన స్థాయి తెలుసుకుని నైచ్యానుసంధానం చేశాడా! అంటే అది లేదు. అయినా అతడికోసం నువ్వు (శ్రీరాముడు) నీ స్థాయి తగ్గించుకుని అతడి స్థాయికి దిగావు. అంతటితో ఆగావా!

లక్ష్మణ స్వామిని చూపించి నీ తమ్ముడు నాకు తమ్ముడు అన్నాడు. లక్ష్మణ స్వామి సహజంగా తన

# గుహప్పెరుమాళ్

అన్నగారి మిత్రులను స్వంత అన్న లాగానే ప్రేమిస్తాడు, గౌరవిస్తాడు. అలాంటిది ఇక్కడ రాముడు తన తమ్ముడు గుహుడికి కూడా తమ్ముడు అనకుండా నీ తమ్ముడు నాకు తమ్ముడు అనడం విశేషం. అంతేనా అంటే ఇంకా ముందుకు వెళ్ళి లేడి కళ్ళ వంటి చంచలమైన కళ్ళుగల సీతను చూసి సీత గుహుడి సోదరి కాబట్టి తనకు భార్య అయింది అన్న భావనతో నీ సఖి అన్నాడు. రాముడు తనకు లక్ష్మణుడు, సీతతో ఉన్న సంబంధం కూడా గుహుడి వలన ఏర్పడినట్లుగా భావన చేస్తున్నాడు

గుహుడి భక్తిని మెచ్చి నువ్వు మిత్రుడివి నాకు. నాకు నువ్వు మిత్రుడివి అనకుండా నువ్వు మిత్రుడివి నాకు అనడం ఇక్కడ విశేషం. అంటే తనతో స్నేహం చేసిన గుహుడే గొప్పవాడు అన్న అర్థంలో రాముడు చెప్పాడు అని తిరుమంగై ఆళ్వార్ల భావన. అంతేనా అంటే ఇవన్నీ ఆళ్వార్లను బాధించలేదు. ఇక్కడే ఉండు. అన్న మాటలు హృదయాన్ని కదిలించాయి. రాముడు తన స్వంత తమ్ముడు లక్ష్మణుని ఆజ్ఞాపించినట్లు, భరతుడికి పాదుకల నిచ్చి, తండ్రి ఆజ్ఞానుసారం 14 సంవత్సరాలు వనవాసం పూర్తి కాకుండా తిరిగి రాలేనని చెప్పి పంపినట్టుగా, గుహుడిని ఇక్కడే ఉండు అని ఆజ్ఞాపించాడు. ఇక్కడ గుహుడు ఈ పద్నాలుగేళ్లు నేను కూడా నీతో వస్తానని చెప్పినట్టు, దానికి శ్రీరాముడు 'వద్దు, నువ్వు రావద్దు, జనావాసానికి భరతుడు, వనప్రదేశాన్ని నువ్వు పాలిస్తూ ఇక్కడే వుండాలి' అని చెప్పినట్లు ఆళ్వార్లు భావన చేశారు.

'శ్రీరంగనాయకా నీ శ్రీపాదల దగ్గర శరణాగతి చేశాను' అన్నారు. అంతటి భాగ్యం పొందినందుకే శ్రీరాముడే తనతో సమానంగా భావించాడు అందుకే ఆయన గుహప్పెరుమాళ్ అయ్యారు.

మనం కూడా గుహప్పెరుమాళ్ పొందిన భాగ్యాన్ని పొందాలని కోరుకుందాం. సీతారాముల కృపకు పాత్రులవుదాం.

మంగళం కోసలేంద్రాయ మహనీయ గుణాత్మనే।
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళమ్ !!

# సతీ అనసూయా దేవి

(21వ పేజీ తరువాయి) లేదని మహాసాధ్వి అయిన సావిత్రి పతి సేవలు చేసిన విధమును, దివ్య స్వరూపిణి అయిన రోహిణి తన పాతివ్రత్యం వలన తన భర్త అయిన చంద్రుని ఒక్క క్షణం విడువక ఆకసమునందు ఉంటుంది" అని అంటూ వైదేహి పలికింది. ఆ పలుకులను విని అనసూయా దేవి ఆమె శిరస్సును ముద్దాడి నిరంతరము చిరునవ్వుతో వెలిగే సీతమ్మను చూస్తూ గొప్ప తపశక్తి గలదానను ఏదైనా ఒక వరము కోరుకోమని అన్నది అనసూయ దేవి.

సీతమ్మ ఏమీ కోరనందున నీవు ఆవంత కూడా కోరకపోయినా నీ కార్య సాఫల్యమునకు నేను తప్పక సహాయ పడగలను. అని ఓవైదేహి! ఈ శ్రేష్ఠములైన మాలలు వస్త్రములు ఆభరణములు అంగరాగములు దివ్యమైనవి, అమూల్యమైనవి. ఇవి ఏమాత్రం వసివాడక నీ శరీరమునకు వన్నెతెస్తాయి. వీటితో నీ భర్తను సంతోషపరచగలవు. ఓ జానకి! శ్రీమహావిష్ణువును లక్ష్మీదేవి వలె నీ భర్తను నీవు అలరించగలవు. అనగానే సీతాదేవి ప్రీతిగా వాటిని స్వీకరించి మహా పతివ్రత అయిన అనసూయాదేవిని భక్తిశ్రద్ధలతో సేవించినది. అంత సీతా స్వయంవరం వృత్తాంతము చెప్పుమని కోరినది సీతా దేవి చెబుతాను అంటూ ఆమె వివాహ గాథను వివరించింది. సీతారాముల పవిత్ర కళ్యాణ గాథను విని సీతాదేవిని గాఢముగా కౌగిలించుకున్నది అనసూయ దేవి.

మానవులకు ఎవరికీ లభించని విధంగా అనసూయాదేవి వాత్సల్యముతో అందించిన ఆదర సత్కారాలను చూసి రామలక్ష్మణులు చాలా ఆనందించారు. శ్రీరామచంద్రునికి తాపసులు సిద్ధులు చేసిన అతిథి సత్కారములు స్వీకరించి ఆ రాత్రి ఆశ్రమమునందే సీత లక్ష్మణులతో ఆ పవిత్ర సమయాన్ని హాయిగా గడిపారు.

మరునాడు ప్రయాణమునకు అనుమతి పొందగా సంపన్నులైన బ్రాహ్మణోత్తములు అంజలి ఘటించి సీతారామ లక్ష్మణులకు శుభాశీస్సులను పలికారు. ఈ విధముగా సీతామాతకు తల్లివలె అలంకరించి స్త్రీ ధర్మాలను పతివ్రత ధర్మాలను తెలిపి మంగళాశాసనాలు చేయవలెనని కూడా తెలియని అజ్ఞానిని నేను అంటూ పెణ్ పిళ్ళై గారు భగవంతుని పట్ల భక్తులు ప్రవర్తించే తీరు తెలియని దానిని అంటూ వాపోయారు. ★

## శ్రీసంప్రదాయ సేవలో

# శ్రీగోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార సేవా కేంద్రం





శ్రీరామ రక్ష సర్వజగద్రక్ష

సర్వజనహితాన్ని కాంక్షిస్తూ ఉపకారం కోసం ఆధ్యాత్మిక సేవలు అందించుటకు స్థాపించబడిన అరుదైన ఆధ్యాత్మిక సంస్థ "గోదా మాధవ ఆధ్యాత్మిక కేంద్రం" "అభయం సర్వభూతేభ్యో దదామి ఏతత్ వ్రతం మమ" అని సర్వ రక్షకుడైన శ్రీరామచంద్రుని ప్రేరణతో "ఆపదుద్ధారక స్తోత్ర ఉపాసనా లక్ష్యంగా శ్రీమాన్ శ్రీ ఆరుట్ల శ్రీనివాసాచార్యులు ఈ సంస్థను స్థాపించారు. సకల జనుల క్షేమాన్ని కోరుతూ ఆపదుద్ధారక స్తోత్ర పుస్తకాలను కోటి ప్రతులు ప్రచురించి పంచి పెట్టారు.

అంతరించి పోతున్న కుటుంబ విలువలను పెంపొందించడం చిన్నారుల హృదయాల్లో దైవభక్తి దేశభక్తి మాతృభక్తి పెంపొందించాలని, సంస్కారవంతులుగా తీర్చిదిద్దాలని, రకరకాల ఆపదలలో ఇబ్బందులలో ఉన్న వారిని ఆదుకొనుటకు భగవత్ సేవల ద్వారా లాభాపేక్ష లేకుండా ఆధ్యాత్మిక సేవలు అందించుట లక్ష్యంగా ఈ సంస్థను స్థాపించారు.

ప్రధానంగా ఆపదుద్ధారక స్తోత్రాన్ని ప్రాచుర్యం చేయడం. గోదా కళ్యాణం శ్రీకృష్ణ జన్మాష్టమి హనుమాన్ జయంతి శ్రావణ మాస పూజలు ద్వాదశి తిథి వంటి పర్వదినాలలో అనేక ప్రదేశాలలో వైభవంగా భగవద్ ఆరాధనలు నిర్వహించి అందరిలో దైవభక్తిని ఆధ్యాత్మిక సేవాదృష్టిని పెంపొందిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పీఠాధిపతుల పెద్దల ఆశీస్సులతో, దీక్షతో ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.. తోగుట పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామి, శ్రీ కృష్ణ దేశికన్ యతి రాజ జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ జీయర్ స్వామి మరెందరో మహనీయులు అనేకమంది భక్తులు ప్రముఖులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో నివేదనలు, అనేక సందర్భాల్లో దీపోత్సవాలు మరెన్నో కార్యక్రమాలు అలంకార శోభితంగా భక్తి భావన ఉట్టిపడేలా వేడుకగా నిర్వహిస్తారు.

హయగ్రీవ జయంతి ఆరాధన చిన్నారుల వాక్ శుద్ధి కి ప్రసాద వితరణ చేయడం ఇక్కడ ప్రత్యేకత. ఇంటింటా శ్రీరామ దీపోత్సవం. పెళ్లిరోజు, పుట్టినరోజు వేడుకలు సంప్రదాయబద్ధంగా జరిపించుట. ప్రతి ద్వాదశి రోజున విశేష తదియారాధన నిర్వహిస్తున్నారు.

హయగ్రీవ జయంతి రోజున పిల్లలతో హయగ్రీవ ఆరాధన






జరిపించి వారికి పుస్తకములు మరియు పెన్నులు ఆశీఃపూర్వకంగా అందించి తల్లిదండ్రుల గొప్పతనాన్ని గురువుల గొప్పతనాన్ని భగవంతుని అనుగ్రహాన్ని వారికి తెలియజేస్తూ కార్యక్రమం నిర్వహించారు

శ్రీ గోదా మాధవ ఆధ్యాత్మిక ప్రచార సేవా కేంద్ర ఆశయములు

1.అత్యంత మహిమాన్వితమైన ఆపదుద్ధారక స్తోత్రమును అందరి భాగస్వామ్యంతో కోటిప్రతులుగా ముద్రించి ఉచిత వితరణ చేయుట

2.వైదికములైన మన సంస్కృతి సంప్రదాయములను విస్తృత ప్రచారం చేయుట

3.మన వైవాహిక వ్యవస్థ పై సదవగాహనను కల్పించడం ద్వారా కుటుంబ వ్యవస్థను తీర్చిదిద్దుట

4. సామూహిక పూజాది కార్యక్రమముల ద్వారా ఆధ్యాత్మిక చైతన్యమును కలిగించుట

5.జీవితంలోని అన్ని విధాల సమస్యలకు శాస్త్రీయ పద్ధతిలో ఆధ్యాత్మిక పరిష్కారములను అందించుట

6.ఉచిత ఉపనయనముల ద్వారా పేద విప్రులకు సేవలు అందించుట

7.నిత్య అన్నదాన ఉచిత వైద్య శిబిరముల నిర్వహణ ద్వారా జనరూప జనార్ధనుని సేవ చేయుట

8.పిల్లలకు మాతృభక్తి, దైవభక్తి, దేశభక్తి, కలిగించి ఉత్తమ సంస్కారవంతులుగా తీర్చిదిద్దుట

9.ఆధ్యాత్మిక వృద్ధాశ్రమాలు మరియు గోశాలలు ఏర్పరచి పెద్దలకు మరియు గోవులకు సేవలందించుట ప్రధానంగా వైదిక సంస్కృతి సాంప్రదాయాల రక్షణ.

ఇత్యాది గొప్ప లక్ష్యాలతో లోకహితం కోసం వీరు చేస్తున్న సేవలకు ఎంతోమంది పెద్దలు ఆశీస్సులు అందించారు విశ్వ జ్యోతిష విజ్ఞాన సంస్థ వారు శ్రీమాన్ ఆరుట్ల శ్రీనివాసచార్యులకు గౌరవ డాక్టరేట్ అందించి సన్మానించారు.

★






# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

(12వ పేజీ తరువాయి)

శిక్షించినా,) రక్షించినా అంతా నీ ఇష్టమే! నీ వేమి చేసినా మాకు సంతోషమే!" అని చేతులు జోడించారు.

మహావిష్ణువు, "ఓ మునీంద్రులారా! మీరు అన్నట్లుగా వీరు అసురరాజులై భూమి మీద జన్మిస్తారు. లోభమోహాలకు లొంగిపోయి, ఉత్తములను హింసించి, భువనాలన్నిటికీ కంటకులై, నాకు శత్రువు లవుతారు. యుద్ధంలో నన్ను ఎదిరించి, నా సుదర్శనచక్రానికి ఆహుతి అవుతారు. తిరిగి నా వద్దకే వచ్చేస్తారు. ఆ పైన వీరికి జననమరణాలు ఉండవు. వీరి చింత వదలివేయండి!" అని పలికాడు.


ఆనందబాష్పాలతో, పులకితదేహాలతో సనకాదులు, ఆ దివ్యమంగళ విగ్రహుడైన విష్ణుమూర్తికి పదేపదే నమస్కరించి, లక్ష్మీనారాయణు లిరువురినీ మళ్లీ మళ్లీ స్తుతించి, అక్కడి నుండి వెళ్లలేక వెళ్లలేక వెళ్లిపోయారు.

పృథుచక్రవర్తి భూమండలాన్ని పాలిస్తున్న కాల మది. అప్పుడు పరమ భాగవతోత్తముడు, బ్రాహ్మణ పూజా ధురంధరుడు ఐన పృథువు, ఒకనాడు, పితృదేవతలను, దేవతలను, ద్విజులను, సత్పురుషులను సంతృప్తి పరచాడు. శ్రీహరి తనకు ప్రసన్నుడు కావాలని ఆశీర్వదించమని వారందరినీ కోరాడు. వారందరూ అతనిని ప్రశంసించి, నమస్కరించారు. అదే సమయంలో సనకాదులు ఆకాశమార్గాన వెళుతూ, అక్కడ దిగారు. పృథుచక్రవర్తి సంభ్రమాలతో పరివారసమేతంగా వారికి ఎదురు వెళ్లి పూజించాడు. "ఈ లోకంలో దేనివల్ల నాకు క్షేమం కలుగుతుందో సెల వీయండి" అని వారిని ప్రార్థించాడు.

వారు, "ఈ సంసారసాగరాన్ని తరించాలంటే, ధర్మ అర్థ కామాలు మూడూ మహోగ్రమైన యమభయం కలిగించేవి. కావున వాటిని వదలి, నాలుగవ పురుషార్థమైన మోక్షాన్నే కోరుకోవాలి. ఓ నరేంద్రా! దేహ ఇంద్రియ ప్రాణ బుద్ధి అహంకారాలతో ఆవృతమైన ఈ స్థావర జంగమాల హృదయాలలో వ్యాపించినవాడు, సర్వభూతాలలో ప్రత్యక్షంగా కనిపించేవాడు, భగవంతుడూ ఐన ఈశ్వరుడు అంతర్యామి రూపంలో ప్రకాశిస్తూ ఉంటాడు. ఇది శ్రీమన్నారాయణుని సత్ రూపం. నీవు ఆయననే నిరంతరమూ కొలువవలసింది" అని బోధించి వెళ్లారు. (సశేషం) ★

# ఋషి వాక్య ప్రబోధాలు





**శ్రీమాన్ శ్రీ డా.యం.టి.ఆళ్వార్ స్వామి**

శ్లో॥ వేదః స్మృతిః సదాచారః స్వస్య చ ప్రియ మాత్మనః
ఏతచ్చతుర్విధం ప్రాహుః సాక్షాత్ ధర్మస్య లక్షణమ్

ధర్మమును గూర్చి వివరణ తెలుసుకోవాలని శ్రద్ధ ఉంటే వేదములు,స్మృతులు,సాధు సత్పురుషుల వ్యవహారాలు, ఆత్మకు ఆహ్లాదము కలిపించే సత్కర్మములు ఈ నాలుగు పరిశీలించితే సనాతన ధర్మం అంటే ఏమిటో తెలుస్తుంది.

"దుర్లభం త్రయమేవైతత్ దేవానుగ్రహ హేతుకమ్
మనుష్యత్వం ముముక్షత్వం మహాపురుష సంశ్రయః"

(శ్రీశంకరాచార్యులు) భగవదనుగ్రహ కారణాలు మూడు. అవి ఏమిటి అని విచారిస్తే మొదటిది మానవ జన్మ లభించడం, రెండవది మోక్షం పొందాలనే తపన ఉండడము, మూడవది మహాత్ములను, భాగవతోత్తములను, భక్తులను ఆశ్రయించడమే! అయితే పైమూడు అందరికి దక్కవు. కాబట్టి మానవజన్మను సార్థకము చేసుకుందాం! ముముక్షుత్వము నకు, భాగవత దర్శనానికి గట్టిగా ప్రయత్నిద్దాం!

"అనుద్వేగ కరం వాక్యం సత్యం ప్రియ హితం చ యత్।
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే॥"

సమాజంలో మాట్లాడేటప్పుడు, వార్తలు వ్రాసేటప్పుడు చాలా జాగ్రత్తగా పదాలు వాడాలి. మనం పలికే పలుకు లేదా వ్రాసే వ్రాత, సత్యమైనదిగా ప్రియమైనదిగా మరియు లోకానికి హితం కలిగించేదిగా (సత్యం శివం సుందరం)ముగా ఉండాలి. ఇలా ఉండడము వాఙ్మయ తపస్సుగా మారుతుంది.

భోగే రోగభయం కులే చ్యుతిభయం విత్తే నృపాలాత్భయమ్
మానే దైన్యభయం బలే రిపుభయమ్ రూపే జారాయాః భయమ్।
శాస్త్రే వాదభయం గుణే ఖలభయం కాయే కృతాన్తాత్ భయమ్
సర్వం వస్తు భయాన్వితం భువి నృణామ్ వైరాగ్యమేవాభయమ్॥

ఈ శ్లోకంలో భర్తృహరి ఒక గొప్ప సందేశం ఇస్తున్నాడు. మానవజీవితం అన్ని దశల్లో భయం భయంగానే ఉంటుంది. అదిఎలా ఉంటుందో చెప్తున్నాడు. భోగాలు అనుభవించేవారికి రోగభయం తప్పదు. ఉత్తమకులం అనేవారికి ఎక్కడ మనం కులహీనుల మౌతామోనన్న భయం వెంటాడుతుంది. ధనవంతులకు చూద్దామా రాజుల నుండి భయము. అభిమానంగా బ్రతికేవారికి ఏమో ఎప్పుడు దైన్యం కలుగుతుందో అనే భయం తప్పదు. బలవంతులకు శత్రు మూలంగా భయం కలుగుతూ ఉంటుంది. ఇక, సౌందర్యవంతులకు వృద్ధాప్య భయము వెంటాడుతుంది. శాస్త్రజ్ఞులకు ఎవరు వచ్చి జయిస్తారో అనే భయము లోలోపల పట్టి పీడిస్తుంది. గుణవంతులకు దుర్మార్గుల వలన పదేపదే భయం కలుగుతుంది. అసలు శరీరము పొందిన ప్రతి జీవికి మృత్యు భయం తప్ప కుండా క్షణ క్షణం వెంటాడు తుంది గదా! ఇలా ఆలోచించడం మొదలుపెడితే మానవులకు సకల వస్తువుల నుండి భయమే కనబడుతుంది. కాని వైరాగ్యము ఒక్కటే ఎల్లప్పుడు భయ రహితంగా ఉంటుంది. అందుకనే మన జీవితం లో వైరాగ్యాన్ని అలవరచుకుందాం!

ఏకోధర్మః పరం శ్రేయః క్షమైకా శాన్తిరుత్తమా
విద్యైకా పరమాతృప్తిః అహింసైకా సుఖావహా

(మనుస్మృతి 12అధ్యాయం) మానవ జీవితంలో ధర్మమొకటి పరమ శ్రేయమును కలిగిస్తుంది. ఓర్పుతో ఉండడమే ఉత్తమమైన శాంతికి మార్గము. చక్కని విద్య ఒకటే విశేషమైన తృప్తిని కలిగిస్తుంది. ఏ ప్రాణికి హింసను చేయకుండటమే మనకు సుఖాన్ని కలిగిస్తుంది.

సన్తుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవచ
యస్మిన్నేవ కులే నిత్యం కల్యాణం తత్ర వై ధ్రువం

ఏ వంశంలో భార్యతో భర్త, భర్తతో భార్య అన్యోన్యంగా సంతోషంతో జీవితాన్ని గడుపుతున్నారో అక్కడ నిశ్చయంగా

## ఋషి వాక్య ప్రబోధాలు

సుఖము శాంతి కళ్యాణముల పరంపరలు వర్షిస్తాయి.

యేచ వేద విదోవిప్రాః యే చాధ్యాత్మ విదో జనాః
తే వదన్తి మహాత్మానం కృష్ణం ధర్మం సనాతనమ్
(వ్యాసమహర్షి)

శ్రీకృష్ణపరమాత్మయే సనాతన ధర్మమని వేదములు. ఆధ్యాత్మ తత్వవిదులు మహర్షులు సమస్త జ్ఞానులు పెద్దలు ఎలుగెత్తి చాటుచున్నారని నిశ్చయముగా తెలుసుకొనుము.

కృష్ణాయ వాసు దేవాయ హరయే పరమాత్మనే
ప్రణతః క్లేశ నాశాయ గోవిందాయ నమోనమః
( శ్రీమద్భాగవతం )

ఈ శ్లోకము మహామహిమతో కూడిన మంత్రము. ప్రతినిత్యం ఉదయం రాత్రి తప్పక పఠించవలెను. శ్రీకృష్ణ పరమాత్మ వాసుదేవుడు శ్రీహరిని నమస్కరించే వారందరి శారీరక, మానసిక క్లేశాలన్నింటిని దూరం చేయగలవాడయిన గోవిందునికి నమో నమః అని మ్రొక్కుదాం! ★

## మంత్రానికి చింతకాయలు రాలుతాయి...?

మంత్రానికి చింతకాయలు రాలుతాయ...? అని ప్రశ్నవేసే ముందు చింతకాయలు రాలడానికి మంత్రం అవసరమా? అని ప్రశ్నించుకోవాలి. చెట్టు మీద చింతకాయలు రాలడానికి మంత్రమే అవసరం లేదు. ఒక కర్రతోనో, రాళ్ళతోనో స్వయంగా చెట్టు ఎక్కో రాలగొట్టొచ్చు. మరి మంత్రం దేనికి కావాలి? చింతకాయలు రాలకొట్టడానికే, కాని బయట చెట్టు కుండే చింతకాయలు కాదు, మన మనస్సనే చెట్టు కుండే చింతలు అనే కాయలని రాల్చడానికి, చింతల అంతు తేల్చడానికి.

కొందరికి వివాహం అవ్వడం లేదని చింత, కొందరికి సంతానం కోసం చింత. కొందరికి ఉద్యోగం కోసం చింత, మరికొందరికి సంపద లేదని చింత. అలానే ఆరోగ్యం, ప్రశాంతత, పలుకుబడి, ధైర్యం ఇలా ఒక్కొక్కటి చేరుతునే ఉంటుంది. ఎన్ని ఒకట్లు చేరినా మరొకటి మిగిలే ఉంటుంది. ఇలా వందకోట్లుగా మారుతున్న ఇక్కట్ల చీకట్ల కట్లని, చింతా చీకట్లని అంతమొందించడానికి వచ్చిన దివ్యకాంతుల యంత్రమే మంత్రం. 'మన్నారం త్రాయతే ఇతి మన్త్రః" మననం చేసే వారిని రక్షిస్తుంది. మనలోని చింతలని భక్షిస్తుంది.

మంత్రం అంటే కేవలం ఓం, నమః అని ముందు వెనక చేర్చేదే కానక్కరలేదు. ఒక తల్లి ద్వారా అందే సందేశం కావచ్చు, ఒక తండ్రి ద్వారా అందే ఆదేశం కావచ్చు, ఒక ఆచార్యుని ద్వారా పొందే ఉపదేశమూ కావచ్చు. అది శ్రుతి పథమై, మహర్షుల అభిమతమై ఆళ్వారాచార్యులకు సమ్మత మైనదై వుండాలి. మతిని స్తిమిత పరచి, ఉన్నత స్థితిని ఉత్తమ గతిని చూపి చింతల లతలను తెగనరికి ప్రశాంతతనిచ్చే హితవచనాల వజ్రాలతో పొదగ బడిన వజ్రాయుధమే మంత్రం! పెద్దలు మనకి చెప్పే మంచి మాటలను విని వదిలి వేయ కుండా, మనసులో ఆ మాటలను పదేపదే మననం చేస్తుంటే, ఆ మాటలే మంత్రాలై మదిలోని చింతల కాయలను రాల గొడతాయి. "చింతా సమం నాస్తి



**శ్రీమాన్ శ్రీ కవి కృష్ణమాచార్యులు**


శరీర శోషణం" అంటారు. శారీరక శ్రమ ఎంత ఉన్నా కలగని ఇబ్బంది కేవలం చింతతో నిండిన మనసుకి కలుగుతుంది. బాహ్య చింతలు పోవాలంటే పరమాత్మ చింతన రావాలి.

అందుకే కులశేఖరాళ్వార్ "చింతయామి హరిమేవ సంతతమ్" అంటారు. హరి చింతనలో ఉన్నవారికి చింతలుండవు. మన చింతలు తీర్చి, "పనికిరాని చింతలను రాల్చె చింతామణిలా విష్ణువు మన చెంతే ఉండగ, దాన్ని గుర్తించిన విష్ణుచిత్తులవలె మన చిత్తంలోనూ విష్ణువుని నిలుపుకొంటే అనుదినం ఆనందపు పంటే!

ఈ రకంగా పెద్దల మాటలను, ఆచార్యుల ఉపదేశాలను నిరంతరం మననం చేస్తూ ఉన్నవారి మనసులోని చింతలనే కాయలు రాలుతాయి. కనుక మంత్రానికి చింతకాయలు రాలతాయి.

★

# విశిష్టాద్వైత సిద్ధాంతము



శ్రీమాన్ శ్రీ ఏ.కే. శ్రీనివాసాచార్యులు

పరమాత్మ శ్రియఃపతి శ్రీమన్నారాయణుడు అఖిల హేయ ప్రత్యనీక కళ్యాణ గుణైకతానుడు. సమస్త లోకులచేత ధ్యానింపబడుతూ లోకులాచరించు వర్ణాశ్రమ ఆచార ధర్మములచేత ఆరాధింపబడుతూ దానితో ప్రసన్నుడై కోరిన కోరికలను తీరుస్తున్నాడు. ఇది "శృతి శిరసి విదీప్తే" వేద సమ్మతమైన సత్యమును తెలుపు దర్శనము. ఇది వేద,సూత్ర, ఆగమ,పురాణ,ఇతిహాస సమ్మతమైన శిష్టాచార ప్రమాణము. ఇదే రామానుజ దర్శనము.

జీవ, ప్రకృతి పదార్థములకు మరియు పరమాత్మకు ఉన్న సంబంధాన్ని చెప్తూ పరమాత్మకు పరతంత్రమై, ఆయనచేత ధరింపబడినది, ఆయన చేతనే నియమింపబడినది భగవంతుడు తనకిష్టమైన రీతిలో ఉపయోగించుకొను విధంగా ఉన్న ఈ జీవ,ప్రకృతులే పరమాత్మకు శరీరము, పరమాత్మ శరీరి అని చెప్పటమే విశిష్టాద్వైత సిద్ధాంత సారాంశము. "చింతయ సర్వం చిద్రూపం తనురితి తస్య హరే రనురూపమ్" పై సూక్తి ఆ విషయాన్నే చెప్తున్నది. మరి ఈ విషయ వివరణము చేయు ఆచార్యులు శాస్త్రాధ్యాయనము చేసి తదర్థ జ్ఞానము, తదనుష్ఠానము కలిగి దానిని ప్రచారము చేయగలిగి ఉండాలి. అదే ఆచార్యుల ప్రధాన లక్షణమై వుండాలి.

జీవులు ప్రధానంగా ఐదు విషయాల్ని తెలుసుకోవాలి. అదే అర్థపంచక జ్ఞానము.

"ప్రాప్యస్య బ్రహ్మణో రూపం ప్రాప్తుశ్చ ప్రత్యగాత్మనః
ప్రాప్త్యుపాయం ఫలం ప్రాప్తేః తథా ప్రాప్తి విరోధిచ"

స్వస్వరూపం, పర స్వరూపం, ఉపాయ స్వరూపం, ఫల స్వరూపం, విరోధి స్వరూపం. ఈ ఐదింటిని అర్థ పంచకం అంటాము. వీటిని చక్కగా తెలుసుకోవడం, మరియు ఆచరణలోకి తెచ్చుకోవడమే విశిష్టాద్వైత సిద్ధాంతము. ఈ సిద్ధాంతాన్ని సాంప్రదాయ బద్ధంగా ఒక శ్లోకంలో చెప్పారు మన పెద్దలు.

"శ్రీమన్ లక్ష్మణ యోగినస్తు భువనం సత్యం తదీశ శ్రియః
కాన్తో బ్రహ్మ స ఏవ సోఖిల తనుః భిన్నా స్థతః చేతనా
సత్యా సంసృతి రీశ నిగ్రహ క్రుతా ముక్తిస్తు భక్త్యాదినా
తత్ ప్రాప్తిః పరమే పదే తదనుభూత్యాఖ్యేతి చా చక్షతే"

శ్రీరామానుజ దర్శనంలో, ప్రపంచము సత్యమైనది. పరమాత్మ శేషి, (అన్నింటికీ ఆయనే యజమాని) అతడే పరబ్రహ్మ. సర్వ జగత్తు ఆయన శరీరము. "జగత్ కృత్స్నం శరీరం తే" అని భగవద్గీత ప్రమాణము. చేతనులు పరమాత్మ కన్నా భిన్నమైనవారు. ఈ సంసారమనునది ఆయన సంకల్పము చేతనే ప్రాప్తిస్తుంది. కనుక సత్యమైనది. కర్మ, జ్ఞానములు అంగములుగా కలదియైన భక్తి వల్లనే ముక్తి కలుగుతుంది. ఆ ముక్తి అను మహదానందం పరమపదంలోనే కలుగుతుంది. మరి మోక్షమంటే? పరమాత్మానుభవమే మోక్షము.

పరత్వమును నిర్ణయించబడినదని చెప్పుటకు అనేక ప్రమాణాలు ఉన్నాయి. శృతులు చెప్తున్నాయి. "యతోవా ఇమాని భుతాని జాయంతే, ఏన జాతాని జీవంతి,"

"ఏకోహవై నారాయణ ఆశీత్..."అను మంత్రముల ద్వారా పరతత్వం చెప్పబడింది. "నిర్గుణం నిరంజనం" అని పరమాత్మ యొక్క నిర్గుణత్వాన్ని బోధించాయి ఈ శ్రుతి వాక్యాలు. అవే శ్రుతులు పరమాత్మ సగుణుడని కూడా చెపుతున్నాయి. వీటన్నిటినీ సరియైన పద్ధతిలో అందరూ తెలిసికొనుటకు వ్యాసభగవానుడు వేద శీర్షములైన ఉపనిషత్తులను సంస్కృత సూత్రములుగా కూర్చాడు. మరల ఆయనే పరాంకుశులుగా అవతరించి ఆ సూత్రార్థములను తిరువాయిమొజి మొదలైన దివ్య ప్రబంధాలుగా "శవిక్కినియ శెంజోల్"' అన్నట్లు వీనుల విందు గావించారు. ఆ తరువాత రామానుజులుగా అవతరించి ఆ అతృప్తామృతమునే అంటే సంస్కృత సూత్రములను ద్రావిడ ప్రబంధములను, శ్రీ భాష్య ప్రబంధ రచనచే సమన్వయం చేశారు. కావున శ్రీ విశిష్టాద్వైత సిద్ధాంతము పరమ వైదికము, శిష్టజన సమ్మతము, సకల జనులకు అనుభవ యోగ్యము. పరమపదాన్ని పొందించు శక్తి కలది. ఐహికమైన సుఖ శాంతులను ఇచ్చునది. ఇదే. ★

# శ్రీ ప్రతివాది భయంకరం అణ్ణన్ స్వామి వైభవం

**శ్రీవేంకటేశ్వరస్వామి సుప్రభాత కృతి కర్త**



**శ్రీమాన్ శ్రీ దరిపల్లి సురేశ్ఆచార్యులు**

(కిందటి సంచిక తరువాయి) వీరి ఇంటి పేరు ముడుంబై నంబి. మరి ప్రతివాది భయంకరులైన వీరు నయన వరదచార్యులకు జ్ఞాన పుత్రులుగా ప్రసిద్ధి చెందిరి. కొంతకాలం తరువాత తిరుమలకు వెళ్లి శ్రీవారి తిరుమంజనానికి ఆకాశ గంగ తీర్థ కైంకర్యం చేస్తూ ఉన్నారు.

ఒక రోజు ప్రాతః కాలంలో తీర్థ కైంకార్యానికి వెళ్ళి కొందరు స్వాములు మనవాళ మామునుల వైభవం చర్చిస్తూ ఉండగా వింటూ ఉండగా తీర్థ కైంకర్యానికి ఆలస్యం అయింది. అర్చకులు ఈ ఆలస్యానికి కోపించి తీర్థాన్ని వారే తీసుకవెళ్లిరి. అణ్ణన్ స్వామి పాశ్చాత్తాపంతో శ్రీవారిని క్షమా ప్రార్థన చేసిరి. కానీ స్వామి వీరి మాట వినకుండా, ఈ రోజు తీర్థం చాలా సువాసనగా ఉంది, కారణం ఏమిటని అడిగిరి. జరిగిన విషయం తెలుసుకొని మనవాళ మామునుల వైభవంతో తీర్థం పరిమళం వెదజల్లుతున్నదనిరి. అనంతరం అన్నన్ స్వామి మనవాళ మామునులను సేవించటానికి శ్రీరంగం బయలు దేరిరి.



మనవాళ మామునుల ఆజ్ఞతో వారి సన్నిధికి అణ్ణన్ స్వామి వచ్చిరి. వారి కోసమే కాలక్షేపాన్ని నిలిపి ఉంచిన మామునులు గోష్ఠిలో చేరి ప్రతి వాదులకే భయంకరులం కానీ శ్రీ వైష్ణవ గోష్టిలో దాసులము అని సెలవియ్యగా మామునులు కాలక్షేపం కొనసాగించిరి.

నాటి నుండి అన్నన్ స్వామి సంబంధీకులందరికి శ్రీ వైష్ణవ దాసన్ అని చెప్పడం కొనసాగింది.

మనవాళ మామునులు సంప్రదాయ శాస్త్ర విషయాలలో చేదోడు వాదోడుగా ఉండిరి. మరియు వారి వద్ద శాస్త్ర పండితులైన అష్ట దిగ్గజాలలో ఒకరుగా ఉండిరి. వారి వద్ద భగవద్విషయం, ఇంకా రహస్య గ్రంథాలను సేవించిరి.

మామునుల ఆజ్ఞ తో శ్రీనివాసునికి సుప్రభాతం, స్తోత్రం, ప్రపత్తి మంగాళా శాసనం సాయించిరి.

ఈ సుప్రభాత మధుర్యానికి, శబ్ద పుష్టికి, అర్థ పుష్టికి పరవశించి ప్రతి రోజు శ్రీనివాసునికి బ్రాహ్మి ముహూర్తంలో ఈ సుప్రభాతం శ్రీనివాసునికి వినిపించాలని ఆదేశించిరి. వారి ఆజ్ఞ నేటి వరకు కొనసాగుతున్నది. ఈ సుప్రభాతంలో అణ్ణణ్ స్వామి పేరు ప్రస్తావించనందున వీరి పేరు ఎవరికి తెలియదు.

మణవాళ మామునులు శ్రీ అణ్ణణ్ స్వామిని మరి కొంతమందిని శ్రీ భాష్యం సాయించమని నియమించిరి. ఇట్లుండగా ఒక రోజు తిరుమలకు గంగా తీరం నుండి సర్వజ్ఞ మిశ్రుడు అనే పండితుడు వచ్చి శ్రీ వైష్ణవులను వాదమునకు పిలిచాడు. అందుకు మామునులు శ్రీ అణ్ణణ్ స్వామిని నియమించారు. తిరుమలలో ఆ సర్వజ్ఞ మిశ్రునితో ధ్వజ స్తంభం దగ్గర 3 రోజులు వాదించి వేణుగోపాలస్వామి అనుగ్రహం తో ప్రతిపక్ష నిరసనం చేయగా శ్రీనివాసుడు విశేష మర్యాదలు జరిపించారు. మణవాళ మునులతో కొంత కాలం తీర్థ యాత్రలు చేసి ఆ యా పెరుమాళ్లకు సుప్రభాతములను అనుగ్రహించిరి. మరి కొంతకాలానికి మణవాళ మామునులు తిరునాడు అలంకరించగా, చింతాక్రాంతులై శ్రీ రంగంలో ఉండజాలక దివ్య దేశ యాత్రలు చేస్తూ తిరునారాయణ పురం వేంచేసిరి. చివరికి తిరుమల వేంచేసి పూర్వం వలె తిరుమంజన తీర్థ కైంకర్యం చేస్తూ పోలిప్పాకం నాయనార్ మొదలైనవారికి ఉభయ వేదాంత గ్రంథాలైన శ్రీ భాష్యం మరియు తిరువాయ్ మొళి ఈడు వ్యాఖ్యానాన్ని కాలక్షేపం సాయిస్తూ, ప్రతివాద భయంకరుడని ప్రసిద్ధితో భగవద్ రామానుజ సిద్ధాంతమును రక్షిస్తూ, ప్రచారం చేస్తూ కొంత కాలానికి తిరునాడు అలంకరించిరి.

★

# అరుదైన మత్స్య గిరీంద్ర స్వామి






"మీనకూర్మవారాహ..." అని భగవంతుని దశావతారాల లో ప్రథమ అవతారం మాత్స్యావతారం. ఈ మత్స్య రూప స్వామి దేవాలయాలు చాలా అరుదు.

వరంగల్, కరీంనగర్ రహదారిలో కరీంనగర్‌కు 34 కిలోమీటర్ల దూరంలో కొత్తగట్టు గ్రామం గుట్టపై మత్స్యగిరీంద్ర స్వామి వెలిశాడు. అరుదైన ఈ దేవాలయంలో వందల సంవత్సరాలనుండి మత్స్యగిరీంద్రులతో పాటు క్షేత్ర పాలకునిగా వెలసిన శ్రీనరసింహస్వామి కూడా పూజలందు కుంటున్నాడు. శ్రీనరసింహస్వామి ఉగ్ర స్వరూపాన్ని శాంత పరచుటకు లక్ష్మీదేవి కూడా ప్రతిష్ఠించబడింది.



మత్స్యావతారంలో మహా విష్ణువు వేదాలను అపహరించి నీటి అడుగున దాగిన సోమకాసురుణ్ణి గుర్తించి వానిని వధించి వేదాలను బ్రహ్మకు అప్పగించాడు. నాడు ఈ కొత్తగట్టు కొలను సోరికలో సోమకాసురుడు దాగివుండి సంహరింపబడ్డాడని కూడా కథనం ఉంది.

బ్రహ్మ మొదలగు దేవతలు వేడుకొనగా అర్చా రూపుడై సువర్ణ మత్స్యరూపుడై వెలిశాడు. కలియుగారంభం అయిన తర్వాత కొంత కాలానికి స్వామిని బ్రహ్మాది దేవతలు ఆరాధించి సామాన్య ప్రజలకు నీ దర్శన భాగ్యం ప్రసాదించుమని వేడుకొనగా ఇక్కడ గుట్టపై గృహలో వెలిశాడని స్థల పురాణం. నాటి మొదలు శేషం వంశస్థులు మత్స్యగిరీంద్ర స్వామికి మరియు మునుల గుట్టపై గృహలో వెలసిన నరసింహస్వామికి పూజలు చేస్తూ వున్నారు.

లక్ష్మీ దేవిని ప్రతిష్ఠించక మునుపు నర్సింహ స్వామి ఉగ్రానికి గ్రామం కాలిపోవటం వల్ల గ్రామం గుట్ట వెనుక వైపున మార్చడం జరిగింది. కొత్తగా ఏర్పరచటం చేత కొత్తగట్టుగా గ్రామానికి పేరు వచ్చింది. కొంతకాలానికి రజాకార్లు ఆలయాలను ధ్వంసం చేస్తూ లక్ష్మి అమ్మవారి తలను నరికి ఒక సంచిలో వేసుకొని వెళు తున్నారట! ఆ సంచి నుండి రక్తం కారుట గ్రహించి బేతిగల్ గ్రామస్థులైన కొందరు పద్మశాలీలు వారిని వారించారు.

అమ్మవారి తలను మరల ప్రతిష్ఠింప చేశారు. ఆ రాత్రి స్వామి వారికి స్వప్నంలో సాక్షాత్కరించి ఇప్పటి మొదలు ప్రతి సంవత్సరం జరిగే నా కళ్యాణ మహోత్సవం మీ చేతుల మీదుగా జరుగుతుందని వరమిచ్చాడట!. ఆ ఆనవాయితీ ఇప్పటికీ ఆలయంలో కొనసాగుతుంది.

ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ పౌర్ణమి రోజునుండి జాతర నిర్వహిస్తారు. మాఘ బహుళ పాడ్యమి రోజున నాకబలి ఉత్సవాలు జరుగుతాయి. ప్రాచీనం నుండి శేషం వంశస్థులు అర్చకులుగా ఉండి ఆరాధనలు నిర్వహిస్తున్నారు. నేడు శేషం మురళీధరాచార్యులు, శేషం మాధవాచార్యులు అర్చకులుగా సేవలందిస్తున్నారు. ★



సూర్య సిద్ధాంతమే ప్రామాణికం

# విద్వత్సమ్మేళనంలో వక్తల అభిభాషణ



పంచాంగ గణనకు సూర్య సిద్ధాంతమే ప్రామాణికం అని విద్వత్సమ్మేళన సభ అభిప్రాయపడింది. జగద్గురువులు, పీఠాధిపతులు, స్వామీజీల దివ్యాశీస్సులతో, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ సహకారంతో అష్టమ వార్షిక విద్వత్సమ్మేళనం 2024 యాదగిరిగుట్ట శ్రీహయగ్రీవ గాయత్రీ ఆశ్రమంలోని శ్రీలక్ష్మీనృసింహ వేద విద్యాలయంలో జూలై 27,28 తేదీలలో వైభవంగా జరిగింది.

తెలంగాణా విద్వత్సభ నేతృత్వంలో నిర్వహించిన విద్వత్సమ్మేళనానికి శ్రీ ఉవే శ్రీమాన్ సంపత్ కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి గారు, బ్రహ్మశ్రీ అప్పయ్య శాస్త్రి గారు బ్రహ్మశ్రీ ఉన్నవ పరిమళ శ్రీనివాస ఆదిత్య కుమార శర్మ గారు. బ్రహ్మశ్రీ యాయావరం చంద్రశేఖర శర్మ గారు, తి.న.చ. అనంతాచార్య గారు, బ్రహ్మశ్రీ దివ్యజ్ఞాన శర్మ గారు, బ్రహ్మశ్రీ దర్శనం శర్మ గారు, శ్రీమాన్ మరిగంటి శ్రీకాంతాచార్య గారు, బ్రహ్మశ్రీ బ్రహ్మబట్ల శ్రీనాథ సిద్ధాంతి గారు, శృంగేరి పీఠం సిద్ధాంతి బహ్మశ్రీ బాచంపల్లి సంతోష్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ఇలాంటి సభలను నిర్వహించడంలో విద్వత్సభ ముందున్నది. ఇది క్రమంగా ప్రాచుర్యం పొందింది.

విశ్వావసు నామ సంవత్సర పండుగలను నిర్ణయించడానికి ఏకాభిప్రాయ సాధన అన్నది ముఖ్యం అంటూ విద్వత్ సభలో పాల్గొన్న సిద్ధాంతులు తొలుత ప్రతిపాదన చేశారు. కొన్ని పండుగలు ముఖ్యంగా తిథి ద్వయం వచ్చినప్పుడు ఎలా వ్యవహరించాలి? పూర్వ సిద్ధాంతమే ప్రమాణం అంటూ జనగామ సిద్ధాంతి గారి ప్రసంగానికి అందరూ ఆమోదం తెలిపారు. సంస్కృత పండితులను కూర్చోబెట్టి ఇటుపక్కన అటుపక్కన సిద్ధాంతులు కూర్చుని సంస్కృతంలో ధర్మశాస్త్రం ఏం చెప్తుంది ఇద్దరి నిర్ణయాలు సమన్వయం చేస్తూ నిర్ణయాలు జరిగేవి. ఆ తర్వాత సుమారుగా 12 సంవత్సరాల నుంచి మన యాయావరం చంద్రశేఖర సిద్ధాంతి గారు ఆ బాధ్యతను తీసుకొని సమన్వయం చేసుకుంటూ ఉత్తరోత్తర అందరిని కూడా అనునయపరుస్తూ సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని ముందుకు నడిపిస్తున్నారు. ప్రస్తుతం ఆబాధ్యతను విద్వత్సభ తీసుకుంది. ముఖ్యంగా నక్షత్ర మండల పరిశీలన తెలియజేసుకున్నట్లయితే దాన్ని బాగా పరిశీలించగలిగినట్లయితే మన పూర్వ సిద్ధాంతానికి గొప్ప వైభవాన్ని తీసుకురావచ్చు అని ఈ సందర్భంగా శ్రీఉవే శ్రీమాన్ సంపత్ కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి గారు నొక్కివక్కాణించారు. సభలో సూర్యసిద్ధాంత వైభవాన్ని జనగామ సిద్ధాంతిగారు వివరించారు. ★

# శ్రీసీతారామ చంద్రస్వామి మందిర ప్రతిష్ఠ





శ్రీరాం నగర్ కాలనీ కరీంనగర్ మల్కాపూర్ రోడ్‌లో కాలనీ వారి సౌజన్యంతో శ్రీసీతారామచంద్రస్వామి మందిరము నిర్మించబడినది. ఆగస్టు 28వ తేదీ నుండి 30 వ తేది వరకు ఆగమ శాస్త్రపండితులు శ్రీమాన్ గోవర్ధనగిరి జగన్నాథాచార్యుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహింపబడ్డాయి. కార్యక్రమంలో శ్రీరామ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మాధవరావు, జి.ఆంజనేయులు మరియు కోశాధికారి యన్ నర్సింహాచారి కాలనీ వాసులు భక్తులు పాల్గొన్నారు. ★

# బాలవిజ్ఞానం

# అందమైన చేతులు

శ్రీమతి విజయ కందాళ

అనగా అనగా ఓ దేశానికి ఒక రాజుగారు. ఆ రాజు గారికి ముగ్గురు అందమైన కుమార్తెలు. ముగ్గురు బాగా చదువుకున్నారు. ఎన్నో శాస్త్రాల్లో పాండిత్యం సంపాదించారు. వారికి అంతులేని భోగభాగ్యాలు ఉన్నాయి. పైగా ముగ్గురు మంచి అందగత్తెలు.

ఇలా ఉండగా ఓ రోజు ముగ్గురు రాకుమార్తెలు వెంట సేవకులను తీసుకొని పోకుండా అడవిలోని అందాలను చూడాలని బయలుదేరారు. చాలాసేపు అడివంతా తిరిగారు. అక్కడి జలపాతాల్లో స్నానాలు చేశారు. సంతోషించారు. అలా వారికి సమయమే తెలియలేదు. చాలా సేపు గడిచాక అలసిపోయి, ఓ చెట్టు కింద కూర్చున్నారు. అప్పటిదాకా చూసిన అడవిలోని అందాలన్నీ మళ్లీ మళ్లీ గుర్తుకు తెచ్చుకున్నారు. అలా మాట్లాడుతూ ఉండగా, మాటల మధ్యలో ఎవరి చేతులు అందంగా ఉన్నాయి? అనే ప్రశ్న వచ్చింది. ముగ్గురు తమ చేతులే అందంగా ఉన్నాయని వాదించుకో సాగారు. ఎవరూ మిగిలిన ఇద్దరు మాట్లాడిన దాంతో ఒప్పుకోలేదు.

ఇలా వాదన నడుస్తుంటే, అక్కడికి ఓ బిచ్చగత్తె వస్తూ కనిపించింది. తనకు బాగా ఆకలిగా ఉందని, తినడానికి ఏమైనా ఇమ్మని దీనంగా అడిగింది. చెదిరిపోయిన జుట్టు, చిరిగిపోయిన బట్టలు, దుమ్ము పట్టిన చేతులు, కాళ్లు చూసి రాకుమార్తెలు అసహ్యించుకున్నారు. ముఖాలను చిరాకుతో పక్కకు తిప్పుకున్నారు. తమ వస్తువులను ఎత్తుకొని పోతుందేమో అని దాచుకున్నారు. వీళ్లు ఏమీ ఇవ్వరని అర్థం చేసుకున్న ఆ బిచ్చగత్తె కొంచెం పక్కకు ఉన్న చిన్న గుడిసె వద్దకు వెళ్ళింది. అందులో ఓ నిరుపేద స్త్రీ ఉన్నది. ఎండకు తిరిగినందుకేమో ఆమె మొహం కమిలి పోయింది. వేసుకున్న బట్టలు అక్కడక్కడ చిరిగి ఉన్నాయి. రాకుమార్తెలను అడిగినట్లుగానే ఆ పేద స్త్రీని ఆకలిగా ఉందని, తినడానికి ఏమైనా ఇమ్మని దీనంగా అడిగింది ఆ బిచ్చగత్తె.

ఆ స్త్రీ లోపలికి వెళ్లి ఒక చిన్న మట్టి ముంతలో తన కోసం దాచుకున్న జావను ఇచ్చి తాగమన్నది. అంతకుమించి ఇవ్వలేకపోతున్నందుకు బాధపడింది. ఆశ్చర్యంగా ఆ బిచ్చగత్తె ఆ స్త్రీని అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లు అని




ఆశీర్వదించింది. ఆ స్త్రీతోపాటు ముగ్గురు రాజకుమార్తెలు ఆశ్చర్యంతో అలా చూస్తూ ఉండిపోయారు. వాళ్ల ఆశ్చర్యాన్ని రెండింతలు చేస్తూ ఆ బిచ్చగత్తె ఓ అందాల రాశిలా మారిపోయింది. రాజ కుమార్తెల వద్దకు నడిచి వచ్చింది. మీ ముగ్గురు అప్పటినుంచి అందమైన చేతులను గురించి వాదులాడుకుంటున్నారు కదా! ఆ మాటలన్నీ నేను విన్నాను. మీ ముగ్గురిలో ఎవరికీ అందమైన చేతులు లేవు. ఎందుకంటే మీలో దయ, కరుణ, జాలి, సానుభూతి అనేవి మచ్చుకైనా లేవు. అవన్నీ ఈ పేదరాలి వద్ద పుష్కలంగా ఉన్నాయి. ఆమె తన కోసం దాచుకున్న ఆ కొద్దిపాటి ఆహారాన్ని నాకు ఇచ్చి నా ఆకలి తీర్చింది.

ఇతరుల కష్ట సుఖాలను తనవిగా భావించని వ్యక్తిని ఎవరూ గౌరవించరు. ఎదుటివారికి సహాయపడటం లోనే అందం ఉంది, గొప్పతనం ఉంది, మానవత్వం ఉంది. ఎదుటివారికి సాయపడాలంటే డబ్బులు ఇవ్వడం ఒకటే మార్గం కాదు. కొన్నిసార్లు మాట సాయం కూడా అవసరముంటుంది. దాన్ని చిన్నప్పటినుండే అలవాటు చేసుకోవాలి. .

ఇతరులకు సహాయపడే మనసు, పేదవారికి దానం చేసే చేతులే, గొప్పవి. అందమైనవి కూడా. అదే ఈ కథలో మనము తెలుసుకోవలసిన ముఖ్యమైన విషయం.

PRAPATTI SRISANNIDHANAM Telugu Monthly SEP 2024 RNI NO : TELTEL12303

# శ్రీసన్నిధి పదకేళి 7



## అడ్డం

1. స్వాయంభువమనువు భార్య (6)
2. యాగ సంరక్షణకు విశ్వామిత్రుడు ఎవరిని పంపమని అడిగాడు (6)
3. నాభి యందు పద్మము గలవాడు (5)
7. పుస్తకపరిచయంలో ఆగస్టు పుస్తకం, (4)

## నిలువు

4. శ్రావణ శుక్రవారం ఏదేవిని పూజిస్తారు. (4)
5. శ్రీరామచంద్రునికి అగస్త్యుడు ఉపదేశించినది (7)
6. శ్రావణ బహుళాష్టమి, రోహిణి నక్షత్రం నాటి పండుగ, (5)
8. ఇంద్రుని వాహనము (4)
9. పరాశరుని కుమారుడు (3)
10. అంజనాదేవి దేవి పేరుతో వున్న కొండ (4)
11. ఘృతం (2)
12. ధుర్యోధనుని తల్లి (3)
13. సప్తార్చి (2)

## శ్రీసన్నిధి పదకేళి (6) సమాధానాలు

విజేతలకు సెప్టెంబర్ నెల పత్రిక పంపించడం జరుగుతుంది

1.చతుస్థానార్చన, 2.మహాభారతము, 3.పదునాలుగు 4.సద్యోగర్భం, 5.పుస్తకపరిచయం, 6. గురుపూర్ణిమ, 7. పాచకులు, 8. గోరింటాకు, 9.కోరిక, 10.అలర్కుడు, 11.పాలు, 12.మేల్కోట, 13.దాస్యం.

సరియైన సమాధానాలు పంపినవారు: కె.వి.చలం, బెంగళూర్, లాస్యశ్రీ, హైదరాబాద్, ఏ.జి.కె.రావు, తిరుపతి, నరసింహాచారి కె,యస్.వి, బెంగళూర్, ప్రసన్న, బి.హెచ్.ఈ.యల్, రాజవర్ధన్, నిజాంపేట్, హైదరాబాద్.

## పదకేళిలో పాల్గొనండి! ఉచిత పత్రిక అందుకోండి!!

ఈ పదకేళిలో సరియైన సమాధానాలు వ్రాసి సరియైన జవాబులు 9502583323 వాట్సప్ ద్వారా పంపండి.

Printed & Edited and Published by DINGIRI SRINIVASA MURTHY on behalf of SRISANNIDHANAM CHARITABLE TRUST and Published at H.No 10-2-225, Vidhyanagar, Karimnagar, Telangana - 505 001
Editor DINGIRI SRINIVASA MURTHY, RNI Title No TELTEL12303, Cell No : 9502583323, Land line No 0878-2253323
Email Id prapatti.srisannidhanam9@gmail.com.